J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 45 సంచిక : 6 11.7.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## ఇటు ప్రభుత్వం.. అటు విపక్షం



# ప్రజల ముందే పంచాయితీ

### 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో కూటమి ప్రభుత్వం

### నాలుగు వారాల ప్రణాళికతో వైఎస్సార్‌సీపీ

### ఎత్తుకు పైఎత్తులతో జనంలోకి...

### పల్లెలు, పట్టణాలకు రాజకీయ ఉక్కపోత

ఆంధ్రప్రదేశ్‌లో సిగపట్టు రాజకీయాలు మొదలైనట్లు కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలై సంవత్సరం పూర్తయిన క్రమంలో అధికార ప్రతిపక్షాలు నువ్వానేనా అనే రీతిలో ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి. ఆరోపణలు, ప్రత్యారోపణలతో దూసుకెళ్తున్నాయి. చంద్రబాబు మేనిఫెస్టోలోని అంశాలన్నింటినీ గుర్తుచేస్తూ ప్రతి ఇంటికీ వెళ్లి, కూటమి ప్రభుత్వం ఎంత బాకీ ఉందో తెలియజేయాలని జగన్ తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇదే సమయంలో తమ పాలనలో రాష్ట్రాభివృద్ధికి సంబంధించి, కూటమి ప్రభుత్వం 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ విజయాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేయాలని నిర్ణయించింది. ఈ పోరులో ఎవరు పైచేయి సాధిస్తారో త్వరలో తేలిపోనుంది. ఈ అంశం రానున్న స్థానిక ఎన్నికల్లో తేటతెల్లం అయ్యే అవకాశం ఉంది. మరోవైపు సందట్లో సడేమియా అన్నట్లు వామపక్షాలు, కాంగ్రెస్ సైతం ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించడం కొసమెరుపు.

#### ఒకే దెబ్బకు రెండు లక్ష్యాలు...!

కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ తొలి ఏడాదిని విజయవంతంగానే ముగించాయి. తొలుత కలహాల కాపురంలా కనిపించినా, రానురానూ సమన్వయంతోనే ముందుకు సాగుతున్నాయి. ఏడాది కాలంలో లోకేష్‌కు డిప్యూటీ సీఎం డిమాండ్, విజయవాడ వరదలు, తిరుమల లడ్డూ వివాదం, మద్యం షాపుల కేటాయింపులో అధికార పార్టీ ఎమ్మెల్యేల బరితెగింపు వంటి అంశాలు ప్రజల్లో ప్రధానంగా చర్చనీయాంశాలవగా, కూటమి పార్టీలు వాటిని టీ కప్పులో తుపానులా ప్రాథమిక స్థాయిలోనే పరిష్కరించుకోగలిగాయి. తాజాగా హనీమూన్ పీరియడ్ ముగిసిన నేపథ్యంలో పూర్తిస్థాయి పాలనపై ఈ మూడు పార్టీలు దృష్టి సారించనున్నాయి. ఇక సూపర్ సిక్స్‌లో ఇప్పటికే సామాజిక పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మెగా డీఎస్సీ, తల్లికి వందనం పథకాలను చంద్రబాబు సర్కారు విజయవంతంగా అమల్లోకి తెచ్చింది. ఇక ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు పథకం అమలుకానుంది. అలాగే అన్నదాత సుఖీభవ, మహిళలకు నెలకు రూ. 1500 పంపిణీ, 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అమలుపై కార్యాచరణ ప్రారంభించాల్సి ఉంది. ఇలాంటి తరుణంలో సంక్షేమ పథకాల అమలుపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవడం, జనంలో నెలకొన్న

2లో

## • నో రిమాండ్

# స్వేచ్ఛా విహంగాలుగా సామాజిక సైన్యం

### సోషల్ మీడియా పోస్టులపై హైకోర్టు ఉత్తర్వులు

### ఏడేళ్లలోపు శిక్షపడే అవకాశం ఉండే కేసుల్లో రిమాండ్ వద్దు

### అన్నీ ఆలోచించి మెజిస్ట్రేట్లు నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు

### నెటిజన్లు మరింత రెచ్చిపోయే అవకాశం

ప్రస్తుతం మెయిన్ స్ట్రీమ్ మీడియా కంటే సోషల్ మీడియానే మోస్ట్ పవర్‌ఫుల్ అనేలా పరిస్థితులు మారిపోతున్నాయి. ఎందుకంటే మెయిన్ స్ట్రీమ్ మీడియాకు కొన్ని నిబంధనలు, ఆంక్షలు ఉంటాయి. అయితే, సామాజిక మాధ్యమాల్లో పోస్టులకు ఆ నియంత్రణ ఉండదు. వాటిని సమీక్షించి, విశదీకరించే వ్యవస్థ ఇంకా ఏర్పడకపోవడమే దీనికి ప్రధాన కారణం. అందుకే రాజకీయ పార్టీలు కూడా ప్రస్తుతం సోషల్‌మీడియా యాక్టివిస్టులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. నాయకులు తమ వాదనను బలంగా తీసుకెళ్లే క్రమంలో నెటిజన్లను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నారు. నిజానికి మీడియా అంటే ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ ఎప్పుడూ ప్రజాసంక్షేమం కోసం పాటుపడాలి. ప్రజాస్వామ్య పరిరక్షణను భుజాలకెత్తుకోవాలి. ఏ విషయంలో నిజానిజాలెంతో గుర్తించాలి. అప్పుడే వార్తా కథనం ప్రసారం చేయాలి. అయితే సోషల్ మీడియా యాక్టివిస్టులు మాత్రం ఓ విషయాన్ని తాము నమ్మిన, నమ్ముకున్నా తమ పార్టీ అధిష్టానం చెప్పిన విధంగా ఒకరిని పొగడడమో ఒకరిని ఏకిపారేయడమో చేస్తుంటారు.



#### మానవత్వం విడిచి మంచి చెడులు మరిచి..!

ఈక్రమంలో కొందరు సోషల్ మీడియా యాక్టివిస్టులు పెట్టే పోస్టులు అత్యంత జుగుప్సాకరంగా ఉంటుంటాయి. వ్యక్తిగత, సామాజికపరమైన హద్దులు దాటి మరీ కొందరు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతుంటారు. ఉచ్చనీచాలు మరిచి పరుష పదాలతో ఎదుటి వారిని కించపరుస్తారు. వ్యక్తిత్వ హననానికీ పాల్పడుతుంటారు. ఇదే సమయంలో రాజ్యాంగపరంగా అత్యంత ఉన్నతస్థాయిలో ఉన్న వారిని సైతం కొందరు సోషల్ సైకోలు విడిచిపెట్టడం లేదు. దీంతో పోలీసులు వారిపై కేసులు నమోదు చేయడం, కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతోంది. అలాంటి పరిస్థితులలో జిల్లా స్థాయిలో మెజిస్ట్రేట్లు నిందితులకు రిమాండ్ విధిస్తున్నారు. అయితే అధికారంలో ఉన్న పార్టీలకు కొందరు పోలీసులు తొత్తులుగా మారి తప్పుడు కేసులు, అక్రమ కేసులు బనాయిస్తున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ దశలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాజాగా కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఏడేళ్లు లోపు శిక్షపడే కేసుల్లో నిందితులను వెంటనే అరెస్టు చేయడం తగదని హితవు పలికింది. విచక్షణతో నిర్ణయం తీసుకోవాలని ఈమేరకు గతంలో నమోదైన అర్నేష్‌కుమార్ కేసులో ఇచ్చిన ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించింది.

2లో



నెల్లూరు పర్యటన సందర్భంగా రేణిగుంట విమానాశ్రయం వద్ద తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి స్వాగతం పలుకుతున్న సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.

# బలవంతపు భూసేకరణ తగదు

## సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కందుకూరు నియోజకవర్గంలోని కరేడులో ఒక కంపెనీ ఏర్పాటుకు బలవంతపు భూసేకరణ తగదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హితవు పలికారు. ఈనెల 8న కందుకూరులోని యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కరేడులో ఇండోసాల్ కంపెనీ ఏర్పాటుకు రైతుల నుంచి బలవంతంగానైనా సరే భూసేకరణ చేయాలని చూస్తున్నారని, అది మంచి పద్ధతి కాదని అన్నారు. ప్రజలు ఆమేరకు నిరసనలు వ్యక్తం చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతోందన్నారు. పంటలు పండని ఖాళీ భూములను పరిశ్రమలకోసం ఇవ్వాలని సూచించారు. ఒక్క కంపెనీ కోసం వేలాదిమంది జీవితాలను ఇబ్బందుల పాలుచేయొద్దన్నారు. కరేడులో 8,800 ఎకరాల భూములు తీసుకోవడంతోపాటు, 16 గ్రామాల ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చట్టప్రకారం గ్రామ సభ నిర్వహించి 80 శాతం మంది గ్రామస్తులు సమ్మతిస్తేనే భూసేకరణ చేయాలనే నిబంధన ఉన్నా, ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. బలవంతపు భూసేకరణను అడ్డుకుంటామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, నాయకులు అజయ్‌కుమార్, జి.వెంకటేశ్వర్లు, కుమార్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీని సందర్శించిన.. కేంద్ర గృహనిర్మాణ శాఖ కార్యదర్శి



కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ కటికితల, ఈనెల 9న ఆ శాఖ ఉన్నతాధికారులతో కలసి శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్‌కామత్ ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రణాళిక, ప్రస్థానం, పారిశ్రామిక ప్రగతి గురించి వివరించారు. ప్రస్తుత పారిశ్రామిక కార్యకలాపాలు, భవిష్యత్తు విస్తరణ వ్యూహాలు, మౌలిక సదుపాయాలు, నివాస గృహాల డిమాండ్, ముఖ్యంగా డార్మిటరీలు మరియు తక్కువ ఆదాయ వర్గాలకు సరసమైన అద్దె గృహాలపై ఈ సందర్భంగా శ్రీనివాస్ చర్చలు జరిపారు. ఇతర పారిశ్రామిక ప్రాంతాలలో విజయవంతమైన గృహ ప్రణాళికల నమూనాలను అధ్యయనం చేయాలని, కేంద్ర గృహ నిర్మాణశాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా వినూత్న ప్రతిపాదనలతో ముందుకు రావాలని ఆయన శ్రీసిటీ బృందానికి సూచించారు. అనంతరం, పారిశ్రామిక ప్రతినిధులతో చర్చల్లో పాల్గొన్న ఆయన, ప్రధానంగా మహిళా ఉద్యోగులకు తక్కువ ధరతోనే అద్దె గృహాలను అందుబాటులోకి తేవడంలో ప్రభుత్వ సహకారం, ఇతర అంశాలపై చర్చించారు. సమగ్ర పట్టణాభివృద్ధి మరియు గృహ నిర్మాణాల విషయంలో మంత్రిత్వ శాఖ నుండి పూర్తి సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అద్భుత ప్రణాళిక, కార్యాచరణతో రూపుదిద్దుకున్న శ్రీసిటీని సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడి ప్రజలు, ఈ ప్రాంతం, దేశ శ్రేయస్సుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. శ్రీసిటీ మరింత వృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన సహాయసహకారాలను తమ మంత్రిత్వశాఖ ద్వారా అందిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర గృహనిర్మాణశాఖ ఉన్నతాధికారులు శ్రీసిటీ పర్యటనకు రావడం తాము గౌరవప్రదంగా భావిస్తున్నామని శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. వారి విలువైన సూచనలు శ్రీసిటీ అభివృద్ధికి మరింత దోహదపడతాయని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం శ్రీనివాస్, శ్రీసిటీ పరిసరాలతో పాటు ఆల్‌స్టోమ్ పరిశ్రమను సందర్శించారు. ఆయనతో పాటు కేంద్ర గృహ నిర్మాణశాఖ (అమృత్ పథకం) సంయుక్త కార్యదర్శి ఇషా కాలియా, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య, సాంకేతిక సలహాదారు రోహిత్ కక్కర్, ఇతర సీనియర్ అధికారులు, సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ముందే పంచాయతి

(మొదటిపేజీ తరువాయి)

అపోహలను తొలగించడమే ధ్యేయంగా తమ విజయాలను పూర్తిస్థాయిలో వివరించేందుకు సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో కూటమి ప్రభుత్వ నాయకులు, ప్రజాప్రతినిధులు రాష్ట్రాన్ని చుట్టేయడం ప్రారంభించారు. తద్వారా ప్రజల ఆకాంక్షలను పూర్తిస్థాయిలో తెలుసుకుని తదనుగుణంగా పాలనలో మార్పులు, చేర్పులు చేసుకోవాలని సర్కారు పెద్దలు భావిస్తున్నారు. అలాగే విద్య, వైద్యం, రోడ్లు తదితర రంగాల్లో గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని తెలియజేయడం, కొత్త ప్రాజెక్టులు, ఆవిష్కరణలు, పెట్టుబడులకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించడం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కాలికి బలపం కట్టుకున్నట్లుగా ప్రజల్లోకి చొచ్చుకెళ్తున్నారు. ఇదే సమయంలో తీరుమార్చుకోని ఎమ్మెల్యేలపై ప్రత్యేకదృష్టి సారిస్తానని చంద్రబాబు ప్రకటించడంతో ఆ పార్టీ నాయకుల్లో ఎవరికి మూడుతుందో అనే ఉత్కంఠ నెలకొంది.

### నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై కొరడా!

సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపైనా, ప్రజల్లో తమ గ్రాఫ్‌ను పెంచుకోని ఎమ్మెల్యేలపైనా కొరడా ఝుళిపిస్తానని సీఎం చంద్రబాబు ఇటీవలి పార్టీ సమావేశంలో స్పష్టం చేశారు. దీంతో ఎమ్మెల్యేలు ఎవరికివారు తమ శాయశక్తులా సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కంకణం కట్టుకున్నట్లు కనిపిస్తోంది. ఇక ఈ ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపై ఉండనుండడంతో ఇప్పటినుంచే చురుగ్గా ఉన్న పార్టీ నాయకులు ఎవరు, ఎవరికి ఏ బాధ్యత అప్పగించాలి అనే విషయాలపై కూడా ఎమ్మెల్యేలు దృష్టి సారిస్తున్నట్లు తెలిసింది. దీంతో కింది స్థాయి నాయకులు కూడా హుషారుగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం.

### 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' పేరుతో పోరుబాట!

ఇక రాష్ట్రంలో చావు తప్పి కన్ను లొట్టబోయినట్లుగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని రక్షించుకునేందుకు మాజీ సీఎం, ప్రస్తుత విపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి నానా అగచాట్లు పడుతున్నారు. ఈ క్రమంలో స్తబ్దుగా ఉన్న పార్టీ నాయకుల్లో ఉత్తేజాన్ని నింపేందుకు తన జిల్లా పర్యటనలను జగన్ వేదికగా చేసుకుంటున్నారు. అధికారంలో ఉన్న చంద్రబాబే పార్టీ నాయకులను 2029 ఎన్నికలకి అప్పుడే సిద్ధం చేస్తున్న క్రమంలో, తాను వెనుకపడిపోకూడదన్నట్లుగా జగన్ కూడా తన పార్టీ కేడర్ మొత్తం జనంతో మమేకమయ్యేలా ప్లాన్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే నాలుగు వారాల ప్రణాళిక పేరుతో "రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో" అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు అబద్ధాలు మోసాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ రెడ్‌బుక్ పేరుతో అణిచివేత ధోరణి అవలంభిస్తున్నారన్న విషయాన్ని ప్రజలకు జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయిలో తెలియజెప్పాలని నిర్ణయించారు. అలాగే కూటమి పార్టీల డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్రజల్లో ఎండగట్టాలని పార్టీ కార్యదర్శులు, జిల్లా అధ్యక్షులు, యువజన విభాగం సమావేశంలో జగన్ ప్రకటించారు. ప్రశ్నించే గొంతులను చంద్రబాబు సర్కారు నొక్కేస్తోందని, అందుకే ప్రజలకు అండగా ఉంటూ రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించాలని పిలుపునిచ్చారు. గత ఐదేళ్ల జగనన్న పాలనకు కూటమి ప్రభుత్వ ఏడాది పాలనకూ ఉన్న తేడాను తెలియపరుస్తూ సూపర్ సిక్స్‌తో పాటు కూటమి మేనిఫెస్టోలోని 143 వాగ్దానాలు, తద్వారా ఈ ప్రభుత్వం ప్రజలకు ఉన్న బకాయి మొత్తాన్ని అంకెల్లో వివరించాలని సూచించారు. దీంతో నియోజకవర్గ సమన్వయ కర్తలు, ఎంపీ అభ్యర్థులు, జిల్లా అధ్యక్షులు నాలుగు వారాల ప్రణాళిక కార్యక్రమానికి అవసరమైన సరంజామాను సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది. ప్రత్యేకంగా రూపొందించిన క్యూఆర్ కోడ్ ద్వారా ఒక్కో కుటుంబం చంద్రబాబు సర్కారు వల్ల ఎంత నష్టపోయింది లెక్కగట్టి తెలియజేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇక కూటమి నేతలు ఇచ్చిన బాండ్లు, హామీలు, పథకాల పరిస్థితి ఏమిటనే విషయంపై కూడా చర్చించాలని తీర్మానించారు. దీంతో అటు గ్రామాలు, ఇటు పట్టణాలనే తేడా లేకుండా అధికార, ప్రతిపక్ష నాయకులు ప్రజలతో మమేకమవుతూనే ప్రత్యర్థి పార్టీలను దోషిగా చూపించే ప్రయత్నం చేయనున్నారు. ఫలితంగా ఏపీ రాజకీయం రంజుగా సాగుతోంది. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మిణుగురు పురుగులను తలపిస్తున్న కాంగ్రెస్, వామ పక్ష పార్టీలు సైతం స్థానిక సంస్థల ఎన్నికల నాటికి బలం పుంజుకోవాలనే లక్ష్యంతో క్షేత్రస్థాయిలో పార్టీకి జవసత్వాలు నింపేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఈమేరకు పీసీసీ చీఫ్ షర్మిల వరుసగా జిల్లా పర్యటనలు చేస్తున్నారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పోరు మరింతగా ర క్తిగట్టింది. ఏదేమైనా ఎన్నికలై ఏడాది పూర్తయ్యిందో లేదో.. మరోసారి ప్రధాన పార్టీల నాయకులు జనం బాట పట్టడం మారుతున్న నేటితరం రాజకీయ వ్యూహాలకు అద్దం పడుతోందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది ముగిసిందో లేదో అప్పుడే మళ్ళీ ప్రజల ముందు పంచాయతీ పెట్టడం వెనుక త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే ప్రధాన కారణమని విశ్లేషిస్తున్నారు..!

# స్వేచ్ఛా విహంగాలుగా సామాజిక సైన్యం

(మొదటిపేజీ తరువాయి)

అదే సమయంలో సోషల్ మీడియా పోస్టులకు సంబంధించిన కేసుల్లో ఎఫ్ఐఆర్ ( ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్) నమోదుచేసే ముందు సంబంధిత డీఎస్పీతో ప్రాథమిక విచారణ చేపట్టాలని స్పష్టం చేసింది. ఈ విషయంలో ఇమ్రాన్ ప్రతాప్ గాదీ తీర్పును మార్గదర్శకంగా తీసుకోవాలని స్పష్టం చేసింది. సోషల్ మీడియా వ్యాఖ్యలపై నేరం పునరావృతమయ్యే అవకాశం ఉందా..? సాక్షులపై ప్రభావం చూపే పరిస్థితి ఉందా, అనే అంశాన్ని కూడా జడ్జిలు పరిశీలించాలని పేర్కొంది. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిజిస్ట్రార్ పేరుతో ప్రత్యేక జీఓ జారీఅయ్యింది. ఇందులో జిల్లాస్థాయిలోని న్యాయమూర్తులు నిందితుల రిమాండ్ విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తేల్చిచెప్పింది. పౌరుల భావప్రకటనా స్వేచ్ఛను కేసుల ద్వారా హరించివేసే చర్యలను అడ్డుకోవాలని తెలిపింది. అక్రమ కేసులతో వేధింపులు, దర్యాప్తు సమయంలో చిత్రహింసలకు పోలీసులు పాల్పడకుండా క్షేత్రస్తాయిలో అడ్డుకునే బాధ్యతను జిల్లా న్యాయమూర్తులకే హైకోర్టు ధర్మాసనం అప్పగించింది. అయితే ఈ ఉత్తర్వుల ద్వారా ఓ విధంగా రాష్ట్ర పోలీసుల చేతులను హైకోర్టు కట్టివేసింది అని పలువురు విశ్లేషకులు వ్యాఖ్యనిస్తున్నారు.

### మరింతగా రెచ్చిపోయే అవకాశం..

జాతీయస్థాయిలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు వ్యక్తిగత కక్షలకు, స్వార్థపూరిత చర్యలకు ఆలవాలంగా మారిపోయాయి అనడంలో సందేహం లేదు. గతంలో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ జగన్ ప్రభుత్వం కొందరు వృద్ధులు, మైనర్లు చివరికి జర్నలిస్టులను సైతం కటకటాల్లోకి నెట్టింది. కొందరు నాయకులు, కార్యకర్తలు న్యాయమూర్తులపై సైతం తప్పుడు పోస్టులు పెట్టారనే వాదనలూ ఉన్నాయి. ఇక కొందరు నాయకులే స్వయంగా తమ అనుచరులు, కార్యకర్తలను రెచ్చగొడుతూ నీచాతినీచమైన కామెంట్లను తమ ప్రత్యర్థులపై సోషల్ మీడియాలో పోస్టు చేయిస్తున్నారనే వాదనలున్నాయి. పైగా పోస్టుకి ఇంత అని లెక్కగట్టి మరీ వారికి తాయిలాలు ఇస్తున్నట్లు సమాచారం. దీంతో సామాజిక సైన్యం తమ స్థాయి, తమకున్న అవగాహనను మరిచిపోయి ఏ విషయమైనా, ఏ అంశమైనా ఇష్టారాజ్యంగా పోస్టులు పెడుతూ వికృతానందం పొందుతున్నారు. ఫలితంగా ఎందరో మనోభావాలు దెబ్బతింటున్నాయి. ఎంతో మంది ఆ అవమానాలు తట్టుకోలేక ఆత్మహత్యకు సైతం పాల్పడుతున్నారు. అయితే, ఎందరు దోషులు తప్పించుకున్నా ఓ నిర్దోషికి శిక్షపడకూదన్న న్యాయసూత్రం ఆధారంగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సామాజిక మాధ్యమాలకు సంబంధించిన కేసుల్లో పోలీసులు సంయమనం పాటించాలని సూచిస్తూనే, ఖాకీలు ఏకపక్షంగా వ్యవహరించకుండా నియంత్రించాల్సిన బాధ్యతను జిల్లా న్యాయమూర్తులకే అప్పగించింది. తప్పుడు కేసుల్లో రిమాండ్లకు అనుమతించొద్దని ఆదేశించింది. దీంతో ఇప్పటికే సరైన నియంత్రణ లేకుండా ఉన్న సోషల్ మీడియా వ్యవస్థ మరింత గాడితప్పే అవకాశం ఉందని, మరింతగా దిగజారి పోస్టులు పెట్టేందుకు హైకోర్టు ఉత్తర్వులు ఓ అవకాశం కల్పించినట్లవుతుందనే వాఖ్యానాలు కూడా వినిపిస్తున్నాయి.

ఏదేమైనా, ఇప్పటికే సోషల్ మీడియా పోస్టులో నైతికత, మానవత్వం అంపశయ్యపై ఉన్నాయన్నది అందరూ ఒప్పుకునే నిజం. అలాంటిది మరింత స్వేచ్ఛనిచ్చి నియంత్రణను మరిస్తే సోషల్ సైకోల ఆగడాలకు అంతే ఉండదన్నది విశ్లేషకుల వాదన. అందుకే అటు న్యాయస్థానాలు, ఇటు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా చర్చించి ఆలోచించి సోషల్ మీడియా పోస్టులు కట్టుతప్పకుండా ఉండేందుకు ఓ పర్యవేక్షణా వ్యవస్థను ఏర్పాటు చేయాలని హితబోధ చేస్తున్నారు. ఏదేమైనా హైకోర్టు ఉత్తర్వులు మాత్రం కొందరికి పండగే అనే వాదనలు వినిపిస్తుండడం గమనార్హం. ఇప్పటికే తమ ఇష్టానుసారం రెచ్చిపోతున్న సామాజిక సైన్యం హైకోర్టు ఉత్తర్వులతో స్వేచ్ఛా విహంగాలుగా మారినట్లే అన్నది ఎవరూ కాదనలేని వాస్తవం..!



రొట్టెల పండుగ సందర్భంగా ఆఖరిరోజైన గురువారం తన శ్రీమతి సుజిత, మనుమరాలు దేవిరెడ్డి సంయుక్తతో కలిసి బారాషహీద్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

# గిరిజనులకు ఆరోగ్య గుర్తింపు కార్డులు

## • పంపిణీ చేసిన గిరిధర్‌రెడ్డి



నెల్లూరులోని సింహపురి వైద్య సేవా సమితి ట్రస్ట్ (జయభారత్ హాస్పిటల్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన ఆసుపత్రికి సంబంధించిన ఆరోగ్య గుర్తింపు కార్డులను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గిరిజనులకు పంపిణీ చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం, దొంతాళి పంచాయతీ నాంచారమ్మ గిరిజన కాలనీలో ఇటీవల జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సింహపురి వైద్య సేవాసమితి గిరిజనుల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేస్తోందని కొనియాడారు. ఈ ఆరోగ్య కార్డుల ద్వారా జయభారత్ ఆసుపత్రిలో ఉచితంగా వైద్యం చేస్తారని, ఆ సేవలను ఉపయోగించుకోవాలని ఆయన గిరిజనులకు తెలిపారు. జయభారత్ ఆసుపత్రి యాజమాన్యం మొదటగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి ఈ ఆరోగ్య కార్డులు ఇవ్వడం హర్షదాయకమంటూ, ఆ సంస్థకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి పరిమళ మాట్లాడుతూ, సింహపురి వైద్య సేవాసమితి ఈ గ్రామంలో గిరిజన పిల్లలకు బాలసంస్కార కేంద్రం నిర్వహిస్తున్నదని, పిల్లలు భగవద్గీత శ్లోకాలు అద్భుతంగా చెపుతున్నారని అభినందించారు. జిల్లాలో గిరిజన పిల్లల కోసం అనేక రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్వహిస్తున్నామని, 3వతరగతి నుంచి ఉచితంగా ఇంగ్లీష్ మీడియం చదివిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె చెప్పారు. హాస్పిటల్ జనరల్ మేనేజర్ గురుప్రసాద్ మాట్లాడుతూ, తమ సంస్థ ద్వారా జిల్లాలోని గిరిజనులకు విద్య, వైద్య రంగాలలో చేయూతనిస్తున్నామని తెలిపారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అన్ని గిరిజన కుటుంబాలకు ఆరోగ్య గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మండ్ల ఈశ్వరయ్య, గిరిజన నాయకులు పొట్లూరి శ్రీనివాసులు, స్థానిక సర్పంచ్ వెంకయ్యానాయుడు, డిప్యూటీ మేనేజర్ మనోహర్, ప్రాజెక్ట్ ఇన్‌చార్జి మోపూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో..

# నేత్రపర్వంగా గురుపౌర్ణమి



గురుపౌర్ణమి సందర్భంగా నెల్లూరు గాంధీబొమ్మ కూడలి వద్దనున్న శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో ఈనెల 10వతేదీ గురువారం నుంచి పెద్దఎత్తున ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మందిరం ఛైర్మెన్ మన్నెం అమరనాథరెడ్డి, మందిర కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఈనెల 16వ తేదీ వరకు 8 రోజుల పాటు అత్యంత వేడుకగా ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ప్రతిరోజు ఉదయం 7 గంటల నుండి బాబా వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, మధ్యాహ్నం 12 గంటల నుండి సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు శ్రీ సాయిబాబా నగరోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు మందిరం నిర్వాహకులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. అనంతరం, 18వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు బాబా భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు.

## శృతిమించిన నల్లపరెడ్డి - ఆగ్రహించిన అభిమానం!

# ఇదేం సంస్కృతి ప్రసన్నా?



**రాజకీయాలలో విమర్శలు - ప్రతి విమర్శలు సర్వ సాధారణం. అయితే, ఆ విమర్శలు శృతిమించకూడదు, హద్దు దాటకూడదు. ఎవరు ఏ విమర్శ చేసినా అది రాజకీయ పరమైనదిగా వుండాలే తప్ప వ్యక్తిగత జీవితాన్ని కించపరచకూడదు. విమర్శల స్థాయి శృతిమించి ప్రత్యర్థి సహనాన్ని పరీక్షించకూడదు. అలా ఎవరు చేసినా తప్పే.**

అలాంటి సంఘటనే తాజాగా జిల్లాలో చోటుచేసుకుంది. మాజీ మంత్రి, కోవూరు మాజీ శాసనసభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అవినీతిలో పిహెచ్‌డి చేశారంటూ ప్రస్తుత కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రసన్నపై రాజకీయ విమర్శ చేశారు. ఆ విమర్శని వ్యూహాత్మకంగా తిప్పికొట్టాల్సిన ప్రసన్న విచక్షణ కోల్పోయాడు. ప్రశాంతిరెడ్డి విమర్శలకి సమాధానంగా ఆమె వ్యక్తిగత జీవితంపై మాటల దాడి చేశాడు. అలా దాడి చేయడంలో శృతిమించాడు, ప్రశాంతమ్మ గౌరవానికి భంగం కలిగేలా దిగజారుడు మాటలు మాట్లాడాడు. పైగా ఆమె భర్త ప్రభాకరరెడ్డి ఏదో ఒక రోజు హత్యకు గురవుతాడంటూ పిచ్చి ప్రేలాపనలు పేలాడు. వేమిరెడ్డి దంపతుల వైవాహిక జీవితం గురించి మాటలు తూలాడు. అతి జుగుప్సాకరమైన భాషతో వ్యక్తగత విమర్శల బాణాలని సంధించాడు. ఉచ్ఛం నీచం మరచి రెచ్చిపోయాడు. సభ్య సమాజం సిగ్గుపడేలా ప్రవర్తించాడు. నీచాతినీచమైన ఆరోపణలతో వీపీఆర్ దంపతులని ఆడిపోసుకున్నాడు.

ప్రసన్న వ్యవహరించిన తీరు, మాట్లాడిన బాషకి ఎవరికైన కోపం వచ్చి తీరుతుంది. అక్షరాలా అదే జరిగింది. ప్రసన్న మాటలు వీపిఆర్ అభిమానులకి కోపం తెప్పించాయి. వారి ఆగ్రహం పతాక స్థాయికి చేరింది. ఆవేశం కట్టలు తెంచుకుంది. కొంతమంది గుమికూడారు. ప్రసన్న ఇంటిపై దాడికి తెగబడ్డారు. మూసివున్న ప్రధాన ద్వారం తలుపులు బద్దలుకొట్టారు. ఫర్నిచర్‌ని ధ్వంసం చేశారు. టీవీలు పగలగొట్టారు. దొరికిన వస్తువుని దొరికినట్టు విరగ్గొట్టారు. లక్షల ఖరీదు చేసే కారుని తల్లక్రిందులుగా తిరగ్గొట్టారు. ఇదంతా హఠాత్తుగా జరిగిపోయింది. ఎంతమంది వచ్చారో తెలియదు. ఎటునుండి వచ్చారో తెలియదు. ఎవరు పంపారో తెలియదు. కానీ, కొన్ని క్షణాలలో ఊహించని స్థాయిలో విధ్వంసం సృష్టించారు. ఇంట్లో ప్రసన్నకుమార్‌రెడ్డి తల్లి శ్రీలక్ష్మమ్మ, పనిమనిషి తప్ప ఇంకెవ్వరూ లేరు. వారి సమక్షంలోనే ఇదంతా జరిగింది. ఆ సమయంలో ప్రసన్న ఇంట్లో లేరు. ఆయన బయటనుండి వచ్చేలోగా జరగాల్సింది కాస్తా జరిగిపోయింది.

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుగా ఇప్పుడు ప్రసన్న చింతించి ప్రయోజనం లేదు. ఆయన నోరు జారకముందే పర్యవసానం అలోచించి వుండాల్సింది. పోలీసులు కేసు నమోదు చేశారు. చట్టం తనపని తాను చేసుకుపోతుంది.

### ఇది మంచి సంస్కృతి కాదు...!

ఒక మహిళా ప్రజాప్రతినిధిని రాజకీయంగా ఎదుర్కోలేక ప్రసన్న ఇలా వ్యక్తిగత దూషణలకు దిగాడన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రసన్న హద్దుమీరి మాట్లాడడం, ఆ తరువాత ఆయన ఇంటిపైన గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడం ఇప్పుడు జిల్లా రాజకీయాలలోనే కాదు రాష్ట్ర రాజకీయాలలో పెద్ద సంచలనంగా మారింది. ప్రశాంతిరెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక ప్రసన్న ఇలా వ్యక్తిగత జీవితంపై నిందలు వేయడం సబబుకాదనే మాట రాజకీయవర్గాలలో వినపడుతోంది. ఇది మంచి సంస్కృతి కాదన్న భావన కూడా వారినుండి వ్యక్తమవుతోంది. నిజమే! ఇది మంచి సంప్రదాయం కాదు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని రాజకీయపార్టీలు చూసుకోవాలి. గతంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై కాకాణి గోవర్ధన్‌రెడ్డి కూడా ఇదే స్థాయిలో వ్యక్తిగత విమర్శలు చేశారు. ప్రస్తుతం కాకాణి కటకటాలలో ఉన్నారు. ప్రశాంత రాజకీయాలకి మారుపేరు నెల్లూరుజిల్లా. అలాంటి జిల్లాలో ఇలా దిగజారుడు విమర్శలు, దౌర్జన్యపు దాడులూ రెండూ మంచివి కావు. రాజకీయ నేతలు సంయమనం పాటించాలి. నిర్మాణాత్మక విమర్శలు చేసుకోవాలి. వ్యూహాత్మక రాజకీయాలు నడపాలి. అంతే కానీ, ఇలా సిగ్గుమాలిన విమర్శలతో బజారుకెక్కడం భావ్యం కాదు.


### దాడితో మాకు సంబంధం లేదు!

**- ప్రశాంతిరెడ్డి**



ప్రసన్నకుమార్‌రెడ్డికి ఊరంతా శత్రువులే. ఆయన ఇంటిపై ఎవరైనా దాడి చేసుండొచ్చు. మాకు, మా కార్యకర్తలకి, అభిమానులకి ఎలాంటి సంబంధం లేదని ప్రశాంతిరెడ్డి దాడి సంఘటనని ఖండించారు. దాడుల సంస్కృతి వీపీఆర్ కుటుంబానికి లేదన్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడిన మాటల వీడియోని వైసీపీ నేతలు తమ ఇళ్లల్లో మహిళలకి చూపించాలని సలహా ఇచ్చారు. ఒకవేళ నిజంగా వీపీఆర్ అభిమానులు ఏదైనా చేసుంటే కడుపుమంటతో అది కొంతమేరకు జరిగివుండొచ్చని, మిగతాది ప్రసన్నకుమార్‌రెడ్డే సృష్టించుకుని ఉంటాడని ఆమె కామెంట్ చేశారు. ప్రసన్నపై పరువు నష్టం దావావేసి న్యాయపోరాటం చేస్తామని మీడియాతో చెప్పారు.

### నోరు జాగ్రత్త ప్రసన్నా! - సోమిరెడ్డి



రోజురోజుకీ దిగజారుతున్నావు. సిగ్గుమాలిన మాటలు మాట్లాడుతున్నావు. ఉచ్ఛం నీచం మర్చిపోతున్నావు. నోరు జాగ్రత్త ప్రసన్నా... అంటూ మాజీమంత్రి సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రసన్నపై ధ్వజమెత్తారు. గతంలో ఇదే వేమిరెడ్డి దంపతులని ఆది దంపతులని, ఆదర్శదంపతులని కీర్తించిన సంగతి మర్చిపోయావా...? అని ప్రశ్నించారు. నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేదిలేదని హెచ్చరించారు.

### ఆయనే దాడి చేయించుకున్నారేమో!

**- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**



ప్రసన్న ఇంటిపై జరిగిన దాడిలో మా పార్టీకి కానీ, మా పార్టీ కార్యకర్తలకి గానీ ఎలాంటి సంబంధం లేదు. ఆయన మాటలకి కడుపుమండిన వారు ఎవరైనా చేసుండొచ్చు. లేదా సింపతీ కోసమో, సంచలనం కోసమో ఆయనే దాడి చేయించుకొని ఉండొచ్చు. పోలీసులు ఆ కోణంలో కూడా దర్యాప్తు చేయాలి అంటూ రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ దాడిపై స్పందించారు.

### ఖండించిన రాష్ట్ర నేతలు

ప్రశాంతిరెడ్డిపై ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలని రాష్ట్ర స్థాయి కూటమి నేతలు ఖండించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందిస్తూ ప్రసన్న వ్యాఖ్యలు అతి జుగుప్సాకరం అన్నారు. మహిళలని అగౌరపరచే విధంగా మాట్లాడడం వైసీపీ డిఎన్‌ఏలోనే ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యామంత్రి నారా లోకేష్‌తో సహా పలువురు మంత్రులు ఇతర పార్టీల నాయకులూ ప్రసన్న వైఖరిని తప్పుపట్టారు. గౌరవప్రదమైన ఒక మహిళా శాసన సభ్యురాలిపై ఇలా పనికిమాలిన విమర్శలు చేయడం సిగ్గుమాలిన విషయంగా వారంతా అభివర్ణించారు. అలా మాట్లాడడం దిగజారిన రాజకీయాలకి పరాకాష్టగా వారు పేర్కొన్నారు.

లాయర్
జులై 11, 2025

# పెరిగిపోతున్న జనాభా.. ప్రపంచానికి పెద్ద సమస్య!

ప్రపంచ జనాభా నానాటికీ పెరిగిపోతుండడంతో, భవిష్యత్తులో మానవాళికి ఇది మరింత పెద్ద సమస్యగా మారే ప్రమాదం ఎంతైనా ఉందంటున్నారు నిపుణులు. ఒకవైపు ఆహార భద్రత, మరోవైపు నీటి ఎద్దడి..ఇంకోవైపు వాతావరణ మార్పులు కలిసి వెరసి అనేకదేశాల్లో చివరికి పంటలు సరిగా పండక, తినడానికి తిండి లేక జనం అవస్థలు పడాల్సిన పరిస్థితి దాపురిస్తుందంటున్నారు ఇంకొందరు. కొన్ని దేశాల్లో జనాభా కావాలని కోరుకుంటున్నా, అనేకదేశాల్లో పెరుగుతున్న జనాభా అనర్థదాయకంగానే ఉండవచ్చని భావిస్తున్నారు. ఎవరెన్ని అనుకున్నా పుట్టేవాళ్ళు పుడుతూనే ఉన్నారు. నూటపాతికేళ్ళ క్రితం 1900లో ప్రపంచ జనాభా 200 కోట్ల దాకా ఉంటే, 1999 నాటికి 600 కోట్లకు చేరుకుంది. 2020 వచ్చేటప్పటికి 700 కోట్లకు పెరిగితే, తాజాగా 2025 జులై నాటికి ఏకంగా 819 కోట్లకు దాటి పోయింది. జనాభాల్లో మనదేశం అగ్రస్థానంలో ఉంది. 2023లో 143 కోట్లు, 2024లో 145 కోట్ల వరకు ఉన్న మనదేశ జనాభా తాజాగా 2025 జులై నాటికి 146 కోట్లు దాటిపోయింది. ఇదొక రికార్డు అనే చెప్పవచ్చు. కానీ, ప్రపంచవ్యాప్తంగా ఇలా జనాభా పెరుగుతూ పోతుంటే చివరికి పరిస్థితి ఏమిటన్నదే ఇప్పుడు ప్రశ్నార్థకంగా తయారైంది. జనాభా పెరిగిపోవడం వల్ల ప్రజలు బతకడానికి అవసరమైన వనరులకు కొరత ఏర్పడుతుంది. ఆహారం, నీరు, ఇంధనం, ఇతర సహజవనరులు పుష్కలంగా దొరక్క, అనేకరకాలైన ఇబ్బందులకు దారితీస్తుంది. మానవ మనుగడకు మూలకారణమైన ప్రకృతిని, చెట్లను, పర్యావరణాన్ని మానవుడే చేజేతులా విధ్వంసం చేస్తుండడం భవిష్యత్తుకు పెద్ద ముప్పుగా పరిణమించనుంది. మనిషికి నీడనిచ్చే చెట్లను నరికేయడం, అడవులను నాశనం చేస్తుండడంతో మనకు ఆవాసాన్నిచ్చే నేల వేడెక్కిపోతుండడం, వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తూ.. వస్తే అధిక వర్షాలు లేకుంటే కరువులు, లేదా అత్యధిక ఉష్ణోగ్రతలతో భూమండలమంతా అల్లకల్లోలం కావడం జరుగుతూనే ఉంది. జనాభా పెరిగితే.. సామాజికంగా కూడా బతకడం దుర్భరంగా ఉంటుంది. పేదరికం, నిరుద్యోగం, అసమానతలు, వ్యాధుల బాధలు అన్నీ ఒకటొకటిగా పెరిగిపోతాయి. ఇవన్నీ ఒకదానికొకటి గొలుసు లాగా అంటుకుని ఉండే సమస్యలు. జనాభా పెరిగితే, ఇళ్లు-నీళ్లు అన్నీ పెరగాలి. సదుపాయాలన్నీ కావాలి. ఆ వనరులు లేకుండా జనాభా పెరిగినప్పుడే సమస్యలు ఉత్పన్నమవుతాయి. జనాభా పెరిగితే ఆహారోత్పత్తులు పెరగాలి. అవి లేకపోతే ఆహారం కొరత ఏర్పడుతుంది. జనాభా పెరిగితే శ్రామిక శక్తి పెరుగుతుంది. కానీ వారికి తగిన ఉపాధి ఉద్యోగాలు లేకుంటే నిరుద్యోగం ప్రబలిపోయి ఆత్మహత్యలు పెరుగుతాయి. జనాభా పెరిగే కొద్దీ పేదరికం కూడా పెరుగుతూనే ఉంటుంది. అందువల్ల ఆ పెరుగుదలకు తగ్గట్టుగా వనరులను పెంచుకోవాలి, ఉన్న వనరులను పరిరక్షించుకోవాలి. అవి రెండూ చేయలేనప్పుడు జనాభా పెరుగుదల వల్ల నష్టాలే కలుగుతాయని వేరే చెప్పనక్కర లేదు. ఏ దేశంలోనైనా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ, మానవాళి మనుగడకు ప్రాణప్రదమైన వనరులను కాపాడుకోవాలి. జనాభాను అవసరమైన మేరకు నియంత్రించుకుంటూ, ప్రజల జీవనోపాధులకు దెబ్బతగలకుండా చూసుకోవాలి. పుష్కలమైన ఆహారానికి లోటు లేకుండా, ఆరోగ్యానికి ఇబ్బంది లేకుండా బతికే పరిస్థితులను సృష్టించుకోవాలి. అలాంటి వనరుల కల్పన ఎంతో ముఖ్యం. అందుకే పెరుగుతున్న జనాభాతో పాటు పెరుగుతున్న సమస్యలను గురించి, సమాజంలో వాటి ప్రభావం గురించి ఆలోచించడానికి, అధ్యయనం చేయడానికి ఐక్యరాజ్య సమితి జులై 11వ తేదీని 'ప్రపంచ జనాభా దినోత్సవం'గా ప్రకటించింది. ఏదేమైనా, జనాభా పెరుగుదల వల్ల ఏర్పడుతున్న సమస్యల సవాళ్లను ఎదుర్కోవడానికి ఏంచేయాలో ఎవరికివారు ఆలోచించుకోవాలి. ప్రపంచ ప్రగతికి, మానవాళి భవితకి ఏది ఎంతవరకు అవసరమో ఆయా దేశాలు అధ్యయనంచేసి, జనాభా పెరుగుదలతో కలుగనున్న అనర్థాలను నివారించుకునేందుకు ముందస్తుగానే సమాయత్తం కావాలి. ఇది ఏ ఒక్కరోజుతో పోయేది కాదు, ఎప్పటికప్పుడు పెరుగుతుండే సమస్య. కనుక, ప్రభుత్వాలతో పాటు మేధావులు కూడా జనాభా సమస్యల పట్ల జాగరూకత వహించాలి. పెరిగిపోతున్న జనాభా పెద్ద సమస్య కాకుండా చూసుకోవాలి. ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సహకరించాలి. అందరూ ఆలోచించాలి. ఆ ఒక్కరోజైనా (జులై 11) ఆమేరకు సమయం కేటాయించడం అవసరం!

(... జులై 11, ప్రపంచ జనాభా దినోత్సవం)

# వీఆర్ హైస్కూలు పేరు మార్చొద్దు..!

వంద సంవత్సరాలకిపైగా చరిత్ర కలిగిన చారిత్రాత్మక విద్యాసంస్థలు వేంకటగిరి రాజా(వీఆర్) విద్యాసంస్థలు. నాలాంటి వాళ్ళు వేలాదిమందికి విద్యాబుద్ధులు చెప్పి బంగారు బాటలు వేసిన సంస్థలు వీఆర్ హైస్కూలు మరియు వీఆర్ కాలేజీ. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మూర్ఖపు నిర్ణయాల వల్ల ఆ విద్యాసంస్థలు మూతబడ్డాయని విని చాలా బాధపడ్డాను. ఇప్పుడు మంత్రి నారాయణ గారి చొరవతో వీఆర్ హైస్కూలు కార్పొరేట్ సొబగులు దిద్దుకుని పునః ప్రారంభమయ్యిందని తెలిసి చాలా సంతోషం కలిగింది. అయితే, వీఆర్ హైస్కూలుకి వీఆర్ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూలుగా పేరు పెట్టారని పత్రికలలో చదివాను. అది సమంజసం కాదు. అత్యంత పురాతనమైన ఈ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ పేరును వీఆర్ హైస్కూలుగానే ఉంచాలన్నది నా విజ్ఞప్తి. ఈ విషయంలో నారాయణ గారు పునరాలోచన చేసి అధికారులకి ఆదేశాలు ఇచ్చి పాత పేరునే యథాతథంగా ఉంచి, కేవలం వీఆర్ హైస్కూలుగానే కొనసాగించవలసిందిగా కోరుతున్నాను.

– బి. హేమంత్‌రెడ్డి, బెంగుళూరు.

# నెల్లూరు రైల్వేస్టేషన్ పనుల వేగం పెంచాలి!

"అమృతభారత్ స్టేషన్ పథకం"లో భాగంగా దాదాపు వందకోట్లకిపైగా నిధులతో, అత్యాధునిక వసతులతో కొత్త అందాలు దిద్దుకుంటున్న నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ పనులు నత్త నడక నడుస్తున్నాయి. ఇప్పటికే 57 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు ఓ వైపు చెప్తున్నా, మరోవైపు ప్రయాణీకుల కష్టాలు మాత్రం వర్ణనాతీతం. ఇక్కడ ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు జరుగుతున్నట్లుగా కనపడడం లేదు. ఫలితంగా ప్రయాణీకులకి కష్టాలు తప్పడంలేదు. ముఖ్యంగా పాత స్టేషన్ పైకప్పులు తొలగించడంతో వానల్లో, ఎండల్లో ప్రయాణీకుల బాధలు అన్నీఇన్నీ కావు. నెల్లూరుస్టేషన్ నుండి రోజూ ప్రయాణించే కొన్ని వందలమంది రైలు ప్రయాణీకులు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. నెల్లూరు పార్లమెంటుసభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి గారు ఈ విషయంపై దృష్టిపెట్టి పనుల పురోగతిని సమీక్షిస్తే బాగుంటుంది. అధికారులతో, కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనుల వేగాన్ని పెంచేలా ఆదేశాలు ఇవ్వాలి.

– కే.వీ.కుమార్, బాలాజీనగర్, నెల్లూరు.

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# కొండాయపాలెం రోడ్డులో వీధి లైట్లు కావాలి!

చెన్నై, బెంగళూరు, తిరుపతి, గూడూరు వైపు నుండి జాతీయ రహదారిపైన వచ్చే వాహనదారులు నగరంలోకి రావాలంటే వేదాయపాలెం కూడలి లేదా కొండాయపాలెం రోడ్డునే ఎక్కువగా వాడుతుంటారు. ముఖ్యంగా జాతీయ రహదారి నుండి నగరంలోని అన్నమయ్య కూడలి వరకు వున్న కొండాయపాలెం రోడ్డు రాత్రివేళల్లో సైతం రద్దీగా ఉంటోంది. ఈ ప్రధాన రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతీ శనివారం వందలాది మంది వెంకయ్యస్వామి భక్తులు కూడా ఇదే మార్గంలో కాలి నడకన గొలగమూడికి వెళ్తుంటారు. నేతలు, అధికారులు దృష్టి పెట్టి జాతీయ రహదారి నుండి అన్నమయ్య కూడలి వరకూ వీధి దీపాలు ఏర్పాటుచేస్తే వాహనదారులతో పాటు పాదచారులకి కూడా సౌకర్యవంతంగా ఉంటుంది. రూరల్ ఎంఎల్ఏ శ్రీధర్‌రెడ్డి గారు ఈ విషయాన్ని పరిశీలించి అధికారులకి తగిన సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

ఆర్.పి.రామయ్య, కొండాయపాలెం.

## సత్యపీఠం
నిజాలే మాట్లాడుకుందాం! 98

# అతి పెద్ద వ్యాపారంగా మారిన.. విద్య!

'విద్య.. వ్యాపారం కాకూడదు' అని చాలామంది చెప్తుంటారు. కానీ, ఇప్పుడు సర్వత్రా జరుగుతోంది అదే. భావితరాలకు వెలుగుబాటలు చూపాల్సిన చదువులు కూడా ఇటీవలికాలంలో అతిపెద్ద వ్యాపారంగా మారిపోయాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య అందుబాటులో ఉన్నా, ప్రైవేటు బడుల్లో చదువులు బాగుంటాయనే భ్రమతో అధికశాతం తల్లితండ్రులు ఆ బడుల పట్లే ఆకర్షితులవుతున్నారు. అమ్మానాన్నల ఆ బలహీనతే విద్యా వ్యాపారులకి బలంగా మారిపోతోంది. అధికశాతం ప్రైవేట్ బడుల్లో అడ్మిషన్ల దగ్గర నుంచి వ్యాపారం ప్రారంభమవుతుంది. తల్లితండ్రులకి గుండె దడ కూడా ఆరంభమవుతుంది. ఆ స్కూళ్ళలో ఎల్‌కేజీ నుండి 10వ తరగతి వరకు చదివించుకోవాలంటే ఆషామాషీ కాదు. ఏ తరగతికైనా సరే, వేలకు వేలు ఫీజులు కట్టాల్సిందే. కనీసం పాతికవేలు కడితే తప్ప సుమారైన కాన్వెంటులో ఎల్‌కేజీలో సీటు దొరకదు. ఇక పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అంటూ రకరకాల పేర్లతో వసూళ్ళ పరంపర మొదలవుతోంది. ముఖ్యంగా, చాలా ప్రైవేట్ స్కూళ్ళలో ప్రతిదీ వ్యాపారమే. ఒక్కో స్కూల్‌కి ఒక్కో రకం యూనిఫామ్ పెడతారు. కొన్ని స్కూళ్లలో అయితే ఆ డ్రెస్సులు కూడా పలానా షాప్‌లోనే దొరుకుతాయంటారు. వాళ్ళకీ వీళ్లకీ మధ్య పరస్పర వ్యాపార ఒప్పందం ఉంటుంది. ఇంకా తమాషాగా రకరకాల 'డే'ల పేర్లతో రకరకాల డ్రెస్‌లు వేసుకురమ్మంటారు. గ్రీన్ డే అని, రెడ్ డే అని, బ్లూ డే అని చెప్పి, ఆయా రంగుల డ్రెస్‌లు వేసుకోవాలంటారు. అవి కూడా పలానా షాపులోనే దొరుకుతాయి. ఇదో రకం ఆదాయం! అంతెందుకు, ఒక స్కూల్ నుంచి మరో స్కూల్‌కి మారాలంటే టీసీ తప్పనిసరిగా కావాలి. దానికోసం తిరిగి తిరిగి కాళ్లరగాలి. కానీ, డబ్బులిస్తే మాత్రం..టీసీ దానికై అదే ఇంటికొచ్చి వాలుతుంది. బాలల విద్య ఇంతగా వ్యాపారంగా మారిపోతున్నా పట్టించుకునే నాథులే లేరు. ఇలాంటి పరిస్థితులపై ఎవరూ నోరు మెదపకపోవడం వెనుక కారణం కూడా ఆర్థిక ప్రయోజనాలే అన్నది బహిరంగ రహస్యం!

## నాటి రోజులు..ఎప్పుడో పోయాయి :

పాతకాలంలో అంతా వానాకాలం చదువులని, వానొస్తే బడి ఉండదని అంటూ ఎద్దేవా చేసేవారు. కానీ, అప్పట్లో మంచి చదువులే ఉండేవి. వేలకు వేలు డబ్బుపోసి చదువు'కొనడం' అన్నదే అప్పటివారికి తెలియదు. ఆ కాలంలో చదువుకోవడానికి పెద్దగా వసతులేకపోయినా, వీధి దీపాల కింద కూడా చదువుకుని చాలా మంది ఉన్నత శిఖరాలు అధిరోహించారు. పిల్లల జీవితాలకు బంగారుబాటలు వేసేది విద్యే కనుక, అయ్యవార్లు కూడా ఎంతో శ్రద్ధతో చదువు చెప్పేవారు. పలకా బలపంతో పాటు, ఒక పెద్దబాలశిక్ష, తెలుగువాచకం, ఒక ఎక్కాల పుస్తకం, వేమన శతకం లేదా సుమతీ శతకం ఉంటే చాలు, మూడోతరగతి దాకా దిగుల్లేదు. పాఠశాలలు నడిపేవాళ్ళు కూడా సమాజంలో గౌరవప్రదంగా ఉండేవాళ్ళు. పిల్లల చదువుల్ని వ్యాపారం చేసేసి డబ్బు సంపాదించుకోవాలనే ఆలోచనే అప్పట్లో ఎవరికీ ఇంతలా ఉండేది కాదు. ఉచితంగా చదువు చెప్పడం విద్యాదానంగా, ఒక పుణ్యకార్యంగా భావించేవారు. అంతేకాదు, చదువుతో పాటు, పిల్లలు ఎలా మెలగాలో, జీవితంలో ఎలా నడుచుకోవాలో కూడా అయ్యవార్లు పదేపదే చెప్పేవారు. నీతి శతకాలు బట్టీ పట్టించేవారు. భగవద్గీతను కంఠస్థం చేయించేవారు. చిన్నతనంలోనే దైవభక్తిని వంటపట్టించేవారు. పీటీ పిరియడ్ ఉండేది. వ్యాయామంలో శిక్షణ ఇచ్చేవారు, ఆటలు ఆడించేవారు. క్రాఫ్టు క్లాసులుండేవి, తకిలీలు పెట్టి నూలు వడికించేవారు. డ్రాయింగ్ ఉండేది. వాళ్ళేసే బొమ్మలకంటే, వాళ్ళు కుదురుగా కూర్చుంటున్నారా లేదా, శ్రద్ధగా చెప్పిన పనిమీద దృష్టి పెడుతున్నారా లేదా అని గమనించేవారు. పేపర్ క్రాఫ్ట్ పెట్టి పిల్లల నైపుణ్యాన్ని పెంచేవారు. అంతేకాదు, నిజాయితీగా ఉండాలని, బాగా చదువుకుని దేశభక్తితో సమాజానికి సేవ చేయాలని 'నీతిబోధ' (మోరల్ ఇన్‌స్ట్రక్షన్స్‌ఎం.ఐ) క్లాసులు పెట్టి మరీ చెప్పేవారు. చెడు తిరుగుళ్ళు తిరిగేవాళ్ల చెవి మెలేసేవారు. చదువురాని మొద్దులను కూడా నయానో భయానో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేవారు. ఇప్పుడా రోజులన్నీ పోయాయి. సెల్‌ఫోన్ల మీదున్న శ్రద్ధ చదువు మీద ఉండడం లేదు. బండెడు పుస్తకాలు వీపుమీద తగిలించినా, ఒక్క తెలుగు ముక్క కూడా రాని తెలుగింటి బిడ్డలు లక్షల్లోనే ఉన్నారంటే మన చదువులు ఎటు పోతున్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

## నీతి నిజాయితీలకి, నైతిక విలువలకి తొలి అడుగు పాఠశాలే:

పాఠశాలలంటే కేవలం చదువుచెప్పే కేంద్రాలే కాదు, నీతి నిజాయితీలకి, నైతిక విలువలకి కూడా అవే మూలాధారాలు. పిల్లలు పెద్దయ్యాక నిజాయితీగా..నిబద్ధతతో బతకాలంటే చిన్నతనం నుంచే అలవాటు కావాలి. అబద్ధాలు చెప్పడం, అన్యాయాలు చేయడం వంటి వాటికి దూరంగా ఉంటూ, సన్మార్గంలో వాళ్ళు జీవించాలంటే అందుకు తొలి అడుగు పాఠశాలే. ఎంతటి పెద్దవాళ్ళయినా , ఒకప్పటికి చిన్నపిల్లలే. అయితే, తాము పెద్దయ్యాక చిన్నపిల్లల భవితను చాలామంది పట్టించుకోవడంలేదు. ఇకనైనా తల్లితండ్రులు మేలుకోవాలి. 'మొక్కై వంగనిది మానై వంగునా' అన్నట్టు చిన్నప్పటినుంచి మన సంస్కృతి సంప్రదాయాలు, అన్నిటికీ మించి మంచి సంస్కారాన్ని అలవరచేవి పాఠశాలలే. అవే వ్యాపార నిలయాలైతే ఆ ప్రభావం పిల్లల మీద కూడా పడుతుంది. దీనితో పెద్దవాళ్ళయ్యాక ఏవిధంగా డబ్బు సంపాదిద్దామా అనే ఆలోచనే వాళ్ళ మదిలో కూడా మెదులుతుంది. సేవాభావం, మానవీయత, ధర్మంగా నడుచుకోవాలనే జ్ఞానం లోపిస్తుంది. ఇవన్నీ చేజేతులా మనం చేసుకుంటున్న 'స్వయంకృతాపరాధాలే'. విద్యా వ్యాపారం పిల్లల భవితకే కాదు, చివరికి దేశ ప్రగతికి కూడా అవరోధం అవుతుందన్న సంగతి గ్రహించాలి. చదువులు వ్యాపారమయం కాకుండా, పిల్లలు గాడి తప్పకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్కూళ్ళ యాజమాన్యాలది, ప్రభుత్వానిదే కాదు, తల్లి తండ్రుల మీదకూడా ఉంది. 'శీలేన శోభతే విద్యా' అన్నది మన పెద్దలు చెప్పిన సూక్తి. 'విద్య సత్ప్రవర్తనతో శోభిస్తుంది' అని దీని అర్థం. ఆ సూక్తిని అందరూ బాగా అర్థం చేసుకోవాలి..!

- రాజశ్రీ

# అంబరాన్నంటిన సంబరం.. ఎటు చూసినా భక్త జనం!



## బారాషహీద్ దర్గాలో కోలాహలంగా రొట్టెలపండుగ

## మూడో రోజుకే 10 లక్షల మందికి పైగా భక్తులు

## నెల్లూరంతా సందడే సందడి

## వైభవోపేతంగా..గంధమహోత్సవం

**మత సామరస్యతకు ప్రతీకగా, ప్రశాంతతకు-పవిత్రకు ఆలవాలంగా, భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా నిలచిన నెల్లూరు నగరంలోని బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండుగకు భక్తజనం ఇసుకేస్తే రాలనంతగా.. లక్షలాదిగా తరలి వచ్చారు. మూడోరోజైన మంగళవారం నాటికే కనీసం పదిలక్షల మందికిపైగానే భక్తులు ఈ దర్గాను దర్శించుకున్నట్లు అంచనా. రొట్టెల పండుగ సంబరం అంబరాన్నంటింది. నగరమంతా ఆధ్యాత్మికశోభ వెల్లివిరిసింది. పెద్దసంఖ్యలో వస్తున్న వాహనాలతో, భక్త జనులతో నెల్లూరు నగరం క్రిక్కిరిసిపోయింది. ఎక్కడ చూసినా దర్గా జనమే అన్నట్లుగా, అంతా భక్తజన ప్రభంజనమే కనిపించింది. ఎండ మిడిమేళంగా ఉన్నప్పటికీ దర్గా ప్రాంగణంలో జనం రద్దీ ఏమాత్రం తగ్గలేదు. స్వర్ణాల చెరువులో కోర్కెల రొట్టెలు పట్టుకునే భక్తులతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. లక్షల్లో వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం, నగరపాలక సంస్థ వారు, పోలీసుశాఖ, దర్గా కమిటీ నిర్వాహకులు అందరూ కలసి భారీస్థాయిలో చర్యలు చేపట్టడం పట్ల సర్వత్రా సంతోషం వ్యక్తమవుతోంది. దర్గా కమిటీ, వక్ఫ్ కమిటీల వారు వేలసంఖ్యలో భక్తులకు పెద్దఎత్తున అన్నదానం చేయడం విశేషం. ఒక్క మూడోరోజునే కనీసం 50వేల మందికి అన్నదానం చేసినట్లు అధికారుల అంచనా.**

నెల్లూరు దర్గామిట్టలోని బారాషహీద్ దర్గా, చెంతనే ఉన్న స్వర్ణాల చెరువు ప్రాంతాల్లో 5 రోజుల పాటు జరుగుతున్న రొట్టెల పండుగకు దేశ విదేశాల నుంచి లక్షలాదిమంది భక్తులు తరలిరావడంతో, నగరం భక్తజనసంద్రంగా మారింది. గత ఏడాది కోరిన కోరికలు నెరవేరినవారు రొట్టెలు సమర్పించుకోవడం, కొత్తగా కోరికలు కోరుకునేవారు ఆయా రొట్టెలు స్వీకరించడం ఆనవాయితీ. దేశంలో ఎక్కడా లేని విధంగా జరిగే ఈ రొట్టెలపండుగకు ఈ ఏడాది కూడా భక్తజనం పోటెత్తారు. వివాహం జరగాలని, ఉద్యోగం రావాలని, సంతానం కలగాలని, ఆరోగ్యంగా ఉండాలని ఇలా రకరకాల కోరికలు కోరుకుంటూ భక్తులు స్వర్ణాలచెరువులో ఏర్పాటు చేసిన విభాగాల్లో ఆయా రొట్టెలను పోటీలు పడి స్వీకరించి ఆనందించారు. ముస్లిమ్‌లు, హిందువులు అనే తారతమ్యం లేకుండా, కులమతాల ప్రసక్తే లేకుండా అందరూ కలసి సంతోషంగా రొట్టెల పండుగలో పాల్గొన్నారు. ఈనెల 8న మంగళవారం ఒక్కరోజే కనీసం 4 లక్షల మందికిపైగానే భక్తులు దర్గాను సందర్శించినట్లు అంచనా.

### గంధ మహోత్సవం :

బారాషహీద్ దర్గాలో అత్యంత వైభవంగా జరిగే గంధమహోత్సవం ఎంతో ప్రసిద్ధి. సోమవారం అర్ధరాత్రి తర్వాత, మంగళవారం వేకువన స్థానిక కోటమిట్ట లోని అమీనియా మసీదులో గంధం కలిపిన బిందెలను మేళతాళాలతో, బాణా సంచా వేడుకలతో ఊరేగింపుగా బారాషహీద్ దర్గావద్దకు తీసుకువచ్చారు. ఈ ఊరేగింపులో కూడా వేలాదిమంది భక్తజనం పాల్గొన్నారు. దర్గా ప్రాంగణంలో సమాధిచేసి ఉన్న 12 మంది అమరవీరుల సమాధులకు (బారాషహీదులు) కడప దర్గా పీఠాధిపతి అరీఫుల్లా హుస్సేనీ తదితర మత పెద్దలంతా కలసి గంధలేపనం చేశారు. అనంతరం భక్తిశ్రద్ధలతో ప్రార్ధనలు చేశారు. ఆ గంధం కోసం భక్తులు పోటీలుపడ్డారు. బుధవారం తహలీల్ ఫాతెహా కార్యక్రమం జరిగింది. 10వ తేదీ గురువారం రొట్టెల పండుగ ముగుస్తుంది కనుక, భక్తులు ఇంకా భారీసంఖ్యలో తరలివస్తూనే ఉన్నారు.



### ఆరోగ్య రొట్టె స్వీకరించిన లోకేష్

ఈనెల 7న ముఖ్యమంత్రి చంద్రబాబు తనయుడు, రాష్ట్ర విద్యామంత్రి నారా లోకేష్ బారాషహీద్ దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. తమ నాన్న ఆరోగ్యం బాగుండాలని ఆయన ఆరోగ్య రొట్టెను స్వీకరించారు. నాన్న బాగుంటే రాష్ట్రం బాగుంటుందని, ఆ రొట్టెను నాన్నకు అందజేస్తానని ఆయన అన్నారు. బారాషహీద్ దర్గా అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిధులు కేటాయించారని, ఈ రొట్టెల పండుగకు 10 కోట్లు కేటాయించారని లోకేష్ తెలిపారు. ఈ పండుగలో ఆయనతో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మహమ్మద్ ఫరూక్, మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దర్గా ఫెస్టివల్ కమిటీ ఛైర్మెన్ ఖాదర్‌బాషా, టీడీపీ నాయకులు గిరిధర్‌రెడ్డి, తాళ్లపాక అనూరాధ తదితరులు పాల్గొన్నారు.



## రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కాకర్ల

రైతుల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు దీర్ఘకాలిక పంటలపై మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా ప్రోత్సాహాలందిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా 25వేల ఎకరాలలో ఒకేరోజు పండ్ల మొక్కలను నాటడమే లక్ష్యంగా బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం హర్షదాయకమన్నారు. అందులో భాగంగా ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు మండలం నందిగుంట గ్రామంలో కోట ఎరుకలరెడ్డి పొలంలో మంగళవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్థానిక అధికారులతో కలసి పండ్ల మొక్కలను నాటారు. కాకర్ల మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 150 ఎకరాల్లో పండ్ల మొక్కలను నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మూడు సంవత్సరాలు విడతలవారీగా పండ్ల తోటలను బట్టి ఒక్కో పంటకు ఒక్కోవిధంగా, ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. ఒక్క ఎకరం నిమ్మ పంటకు సుమారు మూడు సంవత్సరాలకు కలిపి లక్షా నలభై ఐదు వేల రూపాయలు అందుతుందన్నారు. రైతులు పండ్ల తోటలలో అంతర్గత పంటలు వేసుకొని ఆదాయం పొందవచ్చన్నారు. అదేవిధంగా ఫారం పాండ్స్‌ను తవ్వడం జరుగుతుందన్నారు. కనుక రైతన్నలు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకొని లాభసాటి వ్యవసాయం చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు.

## మహానేత వైఎస్ పాలనను మరువలేం!

• జయంతి సభలో పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మహానేత అని, ఆయన పాలనలో రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యాయని, వైఎస్ పాలనను మరువలేమని వైకాపా నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కొనియాడారు. జులై 8న వైఎస్ 76వ జయంతి సందర్భంగా నెల్లూరు గాంధీ బొమ్మ కూడలిలోని దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాకాణి పూజిత, వైకాపా నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు జె.వెంకటరెడ్డిలతో కలిసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డా.వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, 108 వాహనం లాంటి పథకాలు పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎంతగానో లబ్ధి చేకూర్చాయన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇల్లు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను డా.వైఎస్ పేద బడుగు బలహీనవర్గ ప్రజలకు అందించారని, ఆయన సేవలను ఇప్పటికీ ప్రజలు స్మరించుకుంటూ ఆయన్ని దైవంగా కొలుచుకుంటున్నారని అన్నారు. అదేవిధంగా, తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ.. గత వైసిపి ప్రభుత్వంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి పాలన అందించారన్నారు. డా. వైఎస్ ఆశయాలతో సాగిన జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజలు కోరుకుంటున్నారని, అది త్వరలోనే సాకారమవుతుందన్నారు. వైకాపా నాయకులు, జిల్లా అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 14 నుంచి..భాగవత సప్తాహం!

కోవూరు సమీపంలోని ఇనమడుగులో ఉన్న శ్రీ సత్యానందాశ్రమంలో ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు భాగవత సప్తాహం జరుగనుంది. భగవాన్ శ్రీ సత్యానంద మహర్షుల వారి దివ్యాశీస్సులతో, ఆశ్రమ ప్రథమ పీఠాధిపతి శ్రీ బ్రహ్మానంద తీర్థస్వామి వారి 8వ ఆరాధనోత్సవాల సందర్భంగా జరిగే ఈ కార్యక్రమానికి ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీహరి తీర్థస్వామి వారు అధ్యక్షత వహించనున్నారు. ఆశ్రమ ఆస్థాన పండితులు, 'బాలకాండ' పద్యానువాదకులు, సంపూర్ణ వాల్మీకి రామాయణం ఆడియోకర్త.. అవధాని కోట రాజశేఖర్ పాల్గొని ఏడురోజుల పాటు భాగవత సప్తాహం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి 6గంటల వరకు, ఆదివారం (ఈనెల 20) రోజున ఉదయం 10 నుండి 12 గంటల వరకు వారి ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందని, భక్తులంతా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆశ్రమ నిర్వాహకులు కోరుతున్నారు.

# నెల్లూరు కబుర్లు

• విపిఆర్ చేయూత

## రెవెన్యూ క్రీడలకు.. 11 లక్షలు



నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. నెల్లూరుజిల్లాలో 10వ రెవెన్యూ క్రీడా సాంస్కృతిక ఉత్సవాల నిర్వహణ కోసం 11లక్షల ఆర్థికసహాయం చేశారు. ఆమేరకు ఇటీవల ఆ మొత్తాన్ని నెల్లూరులోని తన నివాసంలో ఆయన అసోసియేషన్ సభ్యులకు చెక్కు రూపంలో అందించారు. అందుకు విపిఆర్‌కి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జే.ఉదయభాస్కర్, తెలుగు గంగ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ డి.హుస్సేన్ సాహెబ్, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు, పలువురు విశ్రాంత రెవిన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

## 11 నుంచి.. క్రీడలు



రెవెన్యూ ఉద్యోగులందరూ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటాలని జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం నెల్లూరు నగర శివారులోని పోలీస్ శిక్షణ కేంద్రం సమీపంలో ఉన్న క్రికెట్ స్టేడియంలో రెవెన్యూ ఉద్యోగుల క్రీడోత్సవాల్లో భాగంగా, ముందస్తుగా క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ టాస్ వేసి కలెక్టరేట్, కావలి గ్రూపుల మధ్య పోటీలను ప్రారంభించారు. కాసేపు సరదాగా క్రికెట్ ఆడిన జాయింట్ కలెక్టర్, అద్భుతంగా బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈనెల 11వ తేదీ నుంచి మూడు రోజులపాటు నెల్లూరు నగరంలో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో పలు రకాల క్రీడలతో రెవిన్యూ క్రీడోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అనూష, రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అల్లంపాటి పెంచల్ రెడ్డి, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

## 18న జడ్పీ సమావేశం

నెల్లూరు జిల్లాపరిషత్తు సర్వసభ్య సమావేశం ఈనెల 18న నిర్వహించనున్నారు. ఆరోజు ఉదయం 10.30 గంటల నుంచి, పంచాయితీ రాజ్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి, విద్య, విద్యుత్ శాఖలపై సమీక్ష నిర్వహిస్తారు. సమావేశం నిర్వహణ విషయాలను జడ్పీ ఇన్‌ఛార్జి సీఇఓ మోహన్‌రావుతో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఈనెల 8న చర్చించారు.

## నెల్లూరు రెడ్ క్రాస్‌కి అవార్డు



ఉత్తమ సేవ లందిస్తున్న నెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్‌కి రాష్ట్ర గవర్నర్ నుంచి ప్రశంసలు లభించాయి. రెడ్‌క్రాస్ జిల్లాశాఖ అధ్యక్ష కార్యదర్శులు గవర్నర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ–రాష్ట్ర శాఖ వార్షిక సర్వసభ్య సమావేశం ఈనెల 9న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందిస్తున్నవారిని రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ ప్రెసిడెంట్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అభినందించి సన్మానించారు. పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా రెడ్‌క్రాస్ శాఖకు ఉత్తమ జిల్లా శాఖ అవార్డు లభించడంతో రెడ్ క్రాస్ జిల్లా శాఖ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, వైస్ ఛైర్మెన్ చమర్తి జనార్దన్‌రాజు గవర్నర్ చేతులమీదుగా అవార్డులను అందుకున్నారు. అనంతరం, నెల్లూరు జిల్లా శాఖలో అనేక కార్యక్రమాలలో సేవలందించిన మాజీ ఛైర్మెన్ డాక్టర్ ఏ.వి. సుబ్రహ్మణ్యంకి 'ఉత్తమ సేవ' అవార్డును, మునగా వరలక్ష్మికి బంగారుపతకాన్ని బహూకరించారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ మేనేజింగ్ కమిటీ సభ్యులు దాకారపు రవిప్రకాష్, నెల్లూరుజిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, కలికి శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

## లోకేష్‌ను కలసిన..మదన్



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఈ నెల 7న నెల్లూరుకు వచ్చిన యువ నేత, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను 18,19,20 డివిజన్ల క్లస్టర్ ఇన్‌చార్జి నూకరాజు మదన్‌కుమార్ రెడ్డి గౌరవపూర్వకంగా కలిసి తన శుభాభినందనలు తెలియజేశారు.

## 12-13న..చలో కర్నూల్!



తెలుగు భాషను పరిరక్షించాలని కోరుతూ కర్నూలులో జూలై 12 13 తేదీల్లో ఏర్పాటుచేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సును విజయవంతం చేయాలని నెల్లూరు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ విజ్ఞప్తి చేశారు. ఇటీవల నెల్లూరు టౌన్‌హాల్ కళావేదికపై నెల్లూరు జిల్లా రచయితల సంఘం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి ప్రముఖులు, ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఆ సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను ఆమె ఆవిష్కరించారు. నెరసం అధ్యక్షుడు జయప్రకాష్ అధ్యక్షత వహించారు.

## ఇంకా బుద్ధి మారలేదు

**- మంత్రి ఆనం**



మహిళలపై ఇష్టానుసారంగా మాట్లాడడం వైకాపా నేతల సంస్కృతి అని, సభ్య సమాజం తలదించుకునేలా మహిళా శాసన సభ్యురాలిపై వైకాపా నాయకుడు ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నానని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న వ్యాఖ్యలపై ఆయన మండిపడుతూ, ప్రజలు పట్టుమని 11 సీట్లతో బుద్ధి చెప్పినా... వైకాపా నేతల వైఖరిలో, భాషలో మార్పురావడం లేదన్నారు. వైకాపా నేతల మాటలు మహిళల ఆత్మగౌరవాన్ని తూట్లు పొడుస్తున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ఇకనైనా, మహిళల గౌరవాన్ని తుంచే చింతనను తిప్పికొట్టాలని, వైకాపా నాయకత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన హితవు చెప్పారు.

## సంస్కారం లేని మాటలు

**- మంత్రి నారాయణ**



కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్న నీచమైన వ్యాఖ్యలు చేయడం దారుణమని, అవి సంస్కారం లేని మాటలని రాష్ట్ర పురపాలక మంత్రి డా.పొంగూరు నారాయణ ప్రసన్న తీరుపై ధ్వజమెత్తారు. మహిళ అని కూడా చూడకుండా సంస్కార రహితంగా మహిళా ఎమ్మెల్యేపై దురుసుగా మాట్లాడడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మహిళలపై నోరు పారేసుకోవడం వైకాపా నేతలకు కొత్తేమీ కాదని, గతంలో ఆ పార్టీ అధినేత సొంత చెల్లెలిపైనే దుర్భాషలాడారని, ఆ ఉదంతాన్ని ఈ సందర్భంగా నారాయణ గుర్తుచేశారు. షర్మిలపై అసభ్యంగా మాట్లాడిన వైసిపి నేతలకు సభ్యతా సంస్కారాలు లేవని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ అధినేత బాటలోనే మిగిలిన నేతలూ నడుస్తున్నారన్నారు. మహిళల పట్ల వైసీపీ నేతలకి ఎలాంటి అభిప్రాయం ఉందో మరోసారి బయటపడిందన్నారు. మహిళల పట్ల అగౌరవంగా మాట్లాడే వైసీపీ నేతలను ప్రజా జీవితం నుంచి బహిష్కరించాలని ఆయన అన్నారు.

## ప్రసన్న మాటలు హేయం!

**- టిడ్కో ఛైర్మెన్ అజయ్**



ప్రసన్నకుమార్‌రెడ్డి మాటలు హేయమైనవని, సభ్య సమాజం తలదించుకునేలా మహిళాఎమ్మెల్యే పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రసన్నపై కఠిన చర్యలు తీసుకోవాలని టిడ్కో ఛైర్మెన్, జనసేన పార్టీ నెల్లూరు సమన్వయకర్త వేములపాటి అజయ్‌కుమార్ అధికారుల్ని కోరారు. తమ గతం ఎంతో ఘనత అని చెప్పుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి, ఒక మహిళా ఎమ్మెల్యే పట్ల అసభ్యకరమైన పదజాలంతో దూషించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమ అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. వైకాపా నేతలు దౌర్జన్యకాండను కొనసాగిస్తున్నారని, ఎన్నికల్లో ఓడిపోయినా వారికి బుద్ధి రాలేదన్నారు. ఇకనైనా వైకాపా వారు తీరు మార్చుకోవాలని, దిగజారుడు రాజకీయాలు చేయొద్దని ఆయన హితవు పలికారు.




## రెడ్ క్రాస్ సేవలు అపారం



పవిత్రమైన బారాషహీద్ రొట్టెల పండుగలో రెడ్‌క్రాస్ వలంటీర్లు పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులకు అమూల్యమైన సేవలందించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం 'క్లీన్ ఆంధ్ర – స్వచ్ఛ దర్గా' కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా స్వర్ణాలచెరువులో భక్తులు రొట్టెలు మార్చుకునే సమయంలో ప్లాస్టిక్ కవర్లో ఉన్న రొట్టెలను మార్చుకుంటూ, ఆ కవర్లను నీటిలో వదిలివేయడం జరుగుతుంది. వలంటీర్లు ఆ కవర్లన్నీ సేకరించి నెల్లూరు నగర పాలక సంస్థ వారు ఏర్పాటుచేసిన డస్ట్ బిన్‌లలో వేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చినవారు ఏ రొట్టె ఎక్కడెక్కడ మార్చుకోవాలో తెలియక అవస్థలు పడుతుంటే, వారిని గుర్తించి ఆయా బోర్డుల వద్ద వేచివుంటే, అందుకు సంబంధించిన వారు వస్తారని తెలియజేశారు. అదే విధంగా వారితో వచ్చిన పిల్లలు నీటిలో ఆడుతూ పొరపాటున చిన్న చిన్న గాయాలు తగిలిన వారిని ప్రాథమిక చికిత్సా కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐ.ఆర్.సి.ఎస్ ఛైర్మెన్ అన్నదాత వెంకట సుబ్రహ్మణ్యం, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ షేక్ రసూల్, జిల్లా పి.హెచ్.పి నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, దంత వైద్యులు డాక్టర్ ఎంబేటి శ్రీకాంత్, ఆర్.ఎం.పిలు షేక్ గౌస్‌బాషా, పి.వి.సుబ్బయ్య, రాజేశ్వరి, యస్. చక్రధర్, డాక్టర్ ఎస్. ప్రియాంక, డాక్టర్ టి.శ్రీరంజని, జి.జాకబ్, వై.శ్రీను, పెంచలయ్య, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ఆర్ పాఠశాలను అభివృద్ధి చేసి చూపిస్తా!

## - ఎంపీ వేమిరెడ్డి



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి ఆశయాలకు అనుగుణంగా పి-4లో భాగంగా నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్ పేటలో ఉన్న ఆర్ఎస్ఆర్ పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 7న రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా నెల్లూరులో విఆర్ పాఠశాల ప్రాంగణంలో శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో పాఠశాలను దత్తత తీసుకున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని లోకేష్ ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ.. ఆర్ఎస్ఆర్ పాఠశాలను విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధిచేసి విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తామన్నారు. మంత్రి నారా లోకేష్ పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ విద్యాలయాలను తీర్చిదిద్దుతున్నారన్నారు. లెర్నింగ్ ఎక్సెలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్(లీప్) కింద రాష్ట్రంలో వినూత్న, డిజిటల్ విద్యను తీసుకువస్తున్నారన్నారు. పాఠశాలలో నాణ్యమైన రీతిలో మధ్యాహ్న భోజనం అందిస్తున్నారన్నారు. పిల్లలు ఉన్నత స్థాయికి ఎదిగి.. మన జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

### లోకేష్‌ను స్వాగతించిన.. వేమిరెడ్డి దంపతులు



ఈనెల 7న నెల్లూరులో నిర్వహించనున్న పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి..ఆయన సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ఘన స్వాగతం పలికారు. నెల్లూరులోని అనిల్ గార్డెన్స్‌కు చేరుకున్న లోకేష్‌ని స్వాగతించి, శుభాకాంక్షలు తెలిపారు.

# సుపరిపాలనపై..తొలి అడుగు

## ఇంటింటికి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



నెల్లూరు రూరల్‌లో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని 29వ డివిజన్ వి.యం.ఆర్ నగర్ నుంచి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈనెల 9న ప్రారంభించారు. సంవత్సర కాలంలో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి, వారికి అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. గత వైకాపా ప్రభుత్వ విధానాలతో ఆర్థికవ్యవస్థ అస్తవ్యస్తమైపోయినా, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాక వ్యవస్థలన్నీ గాడిలో పడుతున్నాయన్నారు. మనందరి కోసం ఇంత మంచి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి మీ అందరి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలంటూ ఆయన ప్రజలకు సూచించారు. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, క్లస్టర్ ఇంచార్జీలు రాజానాయుడు, నాయకులు గంగాధర్, కో క్లస్టర్ ఇంచార్జ్ మమతారెడ్డి, డివిజన్ అధ్యక్షులు జి.చెంచయ్య, తెలుగుదేశం పార్టీ నెల్లూరు రూరల్ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ అస్లాం తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మరో మైలురాయిని అధిగమించిన.. శ్రీసిటీ-వీఆర్వీ పరిశ్రమ

- ఖతార్ ఎయిర్ లిక్విడ్ సంస్థకు ఉత్పత్తుల ఎగుమతి




శ్రీసిటీలోని క్రయోజెనిక్ ట్యాంకుల తయారీ అగ్రగామి సంస్థ యుఎస్ఏ చార్ట్ ఇండస్ట్రీస్‌కు చెందిన వీఆర్వీ ఆసియా పసిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ, ఖతార్‌లోని ఎయిర్ లిక్విడ్ సంస్థకు అధిక సామర్థ్యం కలిగిన (సూపర్-సైజ్డ్) లిక్విడ్ నైట్రోజన్ స్టోరేజ్ ట్యాంక్‌ను ఎగుమతి చేయడం ద్వారా మరో ప్రధాన మైలురాయిని అధిగమించింది. 'ఎయిర్ లిక్విడ్' ప్రపంచంలోని ప్రముఖ పారిశ్రామిక వాయువుల తయారీ మరియు సేవల సంస్థ. ఇది 75 కంటే ఎక్కువ దేశాలలో ఆరోగ్య సంరక్షణ, ఏరోస్పేస్ రంగాల పరిశ్రమలకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడంలో ప్రసిద్ధి చెందింది. ప్రస్తుతం ఎగుమతి చేస్తున్న 47 మీటర్ల పొడవు, 6 మీటర్ల వ్యాసం, 214 టన్నుల బరువు కలిగిన భారీ క్రయోజెనిక్ ట్యాంక్, విఆర్‌వి అధునాతన ఇంజనీరింగ్ సామర్థ్యాలకు ప్రతీకగా నిలుస్తుంది. మంగళవారం ఇందుకు సంబంధించిన మొదటి ఎగుమతి ట్యాంకును 192-చక్రాల మల్టీ-యాక్సిల్ వాహనం ద్వారా కృష్ణపట్నం పోర్టుకు తరలించారు. ఈ సరఫరా ద్వారా అంతరిక్ష రంగం అవసరాలకు అనుగుణంగా భారీ క్రయోజెనిక్ నిల్వ ట్యాంకుల తయారీలో ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు వీఆర్వీకి దక్కింది.

### విఆర్‌వి పనితీరు స్ఫూర్తిదాయకం - శ్రీసిటీ ఎం.డీ డా.రవీంద్ర సన్నారెడ్డి

ఆత్మనిర్భర్, 'మేక్ ఇన్ ఇండియా' చొరవ మేరకు నిబద్ధత, కృషితో కీలక రంగంలో ఎగుమతులు చేపట్టి మరో మైలు రాయిని అధిగమించిన వీఆర్వీ సంస్థను ప్రశంసిస్తూ, వీఆర్వీ యాజమాన్యానికి..సిబ్బందికి శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో అభినందనలు తెలిపారు. శ్రీసిటీలో ప్రవేశించిన మొట్టమొదటి సంస్థ వీఆర్వీ అని, దిగుమతులకు ప్రత్యామ్నాయంగా ఎగుమతులు చేపడుతూ ప్రపంచ సరఫరా గొలుసుకు దోహదపడుతున్న వీఆర్వీ పనితీరు స్ఫూర్తిదాయకమని తెలిపారు.



రొట్టెల పండగ సందర్భంగా నెల్లూరులోని బారా షాహిద్ దర్గాని సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

## ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



కూటమి ప్రభుత్వ పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి భరోసా ఇచ్చారు. కోవూరు మండలంలోని పడుగుపాడు గ్రామంలో 'సుపరిపాలన తొలి అడుగు-ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా ఆమె పాల్గొని, ప్రభుత్వం ఈ ఏడాదిలో అమలుచేసిన అభివృద్ధి, మరియు సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత ప్రభుత్వ తప్పిదాల వల్లే ఇళ్ల స్థలాల పంపిణీలో జాప్యం జరుగుతోందని, త్వరలోనే అర్హులకు న్యాయం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3 వేలున్న వృద్ధాప్య పెన్షన్ 4 వేలకి పెరిగిందని, మానవతా దృక్పథంతో దివ్యాంగుల పెన్షన్ రెట్టింపుచేసి 6వేల రూపాయలకు పెంచారని వివరించారు. మహిళలకు ఉచితంగా 3 గ్యాస్ సిలెండర్లు, ఎంతమంది పిల్లలుంటే అందరికీ 'తల్లికి వందనం' లాంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. విద్యాశాఖా మంత్రి లోకేష్ సారధ్యంలో భావితరాల భవిష్యత్తుకు పునాదులు పడుతున్నాయన్నారు.

### కష్టకాలంలో అండగా ఉన్నందుకు.. ధన్యవాదాలు

సభ్య సమాజం తలదించుకునేలా తనపై జరిగిన మాటల దాడిని ఖండిస్తూ, తనకు అండగా నిలబడిన తెలుగుదేశం కుటుంబసభ్యులకు, ప్రజానీకానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కష్ట సమయంలో తనకు అండగా నిలబడిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, సహచర ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, పార్టీ జిల్లా అధ్యక్షులకు, వివిధ హోదాల్లో ఉన్న ఎందరో నేతలకు, తనకోసం క్షేత్రస్థాయిలో పోరాటాలు చేసిన మహిళామణులకు కృతజ్ఞతలు తెలియజేశారు. మా మీద అభిమానంతో మేమున్నామంటూ జిల్లావ్యాప్తంగా తరలివచ్చి తనకు సంఘీభావం ప్రకటించిన విపిఆర్ అభిమానులకు, కోవూరు నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలకు రుణపడి ఉంటానన్నారు. 'మీ అందరి మద్దతుతో మనోధైర్యాన్ని కూడగట్టుకుని ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించేందుకు సర్వదా సిద్ధంగా ఉంటానని' ఆమె తెలిపారు.



## 'నల్లపరెడ్డి కుటుంబం' పేరును భ్రష్టుపట్టిస్తున్నాడు

### ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న వ్యాఖ్యలను.. సమాజం క్షమించదు



### మండిపడ్డ ఎమ్మెల్యే సోమిరెడ్డి

ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై ఇటీవల ప్రసన్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండి స్తున్నానని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. పొదలకూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ప్రసన్న తీరును తూర్పారబట్టారు. ఆయనేం మాట్లాడతాడో ఆయనకే తెలియదని ప్రసన్ననుద్దేశించి ఆగ్రహం వ్యక్తం చేశారు. 1996లో పార్లమెంటు ఎన్నికల ముందు చంద్ర బాబునాయుడి చొక్కా పట్టుకుంటానని, ఎన్నికల్లో ఓడిపోగానే కాళ్లు పట్టుకున్నాడని, తిట్టడం.. కాళ్లు పట్టుకోవడం ప్రసన్నకు మొదటి నుంచి అలవాటేనని ఆయన ఎద్దేవా చేశారు. నల్లపరెడ్డి కుటుంబం పేరును భ్రష్టు పట్టిస్తున్నాడని, రాజకీయాల్లో ప్రసన్న లాంటి వ్యక్తిని ఎప్పుడూ చూడలేదన్నారు. ఇప్పటికైనా ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడాలని హితవు పలుకుతున్నానన్నారు. హుందాతనం లేకుండా..ఎన్ని సార్లు గెలిస్తే ఏం లాభమన్నారు. ప్రజాప్రతినిధిగా ప్రజల్లోకి వచ్చాక ప్రసన్న ఈ విధంగా వ్యవహ రించడం శోచనీయమన్నారు. అంతేకాదు, ప్రసన్నెప్పుడూ స్వార్థపూరిత ఆలోచనలేనని, వాడుకోవడం –వదిలేయడం, పొగ డటం– తిట్టడం, మళ్లీ అవసరమైతే కాళ్లు పట్టుకోవడం...ప్రసన్న జీవితమంతా ఇంతేనన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వైసీపీలో ఉన్నప్పుడు పొగడ్తలతో ముంచెత్తాడని, హోమాలు చేయించాడని, వారు దానకర్ణులని కీర్తించాడని, ఆదర్శ దంపతులని పొగడ్తల వర్షం కురిపించాడని సోమిరెడ్డి గుర్తుచేశారు. ప్రశాంతిరెడ్డి ఒక మహిళా ఎమ్మెల్యే అని కూడా చూడకుండా, ఇప్పుడు నోటికొచ్చినట్టు మాట్లాడటం చాలా దుర్మార్గమని, ఒళ్లు కొవ్వెక్కి మాట్లాడినట్టుగా ఉందని ఆయన ప్రసన్నపై మండిపడ్డారు.

### ప్రసన్న మాటలు తీవ్ర అభ్యంతరకరం :

మహిళా శాసనసభ్యురాలైన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన విమర్శలు తీవ్ర అభ్యంతరకర మని, ఆ వ్యాఖ్యలను సమాజం క్షమించదని సోమిరెడ్డి స్పష్టం చేశారు.భార్యాభర్తల మధ్య విభేదాలు సృష్టించేలా మాట్లాడుతాడనీ, కనీస మర్యాద కూడా ఉండదని, మొదటి నుంచి ప్రసన్నకుమార్ రెడ్డి తీరు అంతేనని ఆయన అన్నారు. ప్రసన్న చరిత్ర చూస్తే.. 1996లో లక్ష్మీపార్వతితో ఉండి, చంద్రబాబునాయుడిని ఇంటి కెళ్లి కొడతానని మాట్లాడాడన్నారు. అప్పట్లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో లక్ష్మీపార్వతి పార్టీకి సున్నా సీట్లు రాగానే ప్లేటు ఫిరా యించాడన్నారు. షర్మిల పాదయాత్ర చేసిన సమయంలో బుచ్చిరెడ్డిపాళెం సభలో చంద్రబాబునాయుడిని చెట్టుకు కట్టేసి కొట్టాలన్నాడని, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిని కూడా మొదట దుర్మార్గంగా మాట్లాడి, ఆ తర్వాత ఆయన కాళ్లు పట్టుకుని ఆశీర్వదించమని కోరాడని ఆయన చెప్పారు. అదేవిధంగా ఆనమోళ్లని నోటికొచ్చినట్టు తిట్టాడని, ఆ తర్వాత వాళ్ల ఇంటికెళ్లి కాళ్లపై పడ్డాడని తెలిపారు. పోలంరెడ్డి దినేష్‌రెడ్డి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఘోరమైన వ్యాఖ్యలు చేశాడని ఆయన తెలిపారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి నా తల్లిదండ్రుల గురించి నీచమైన వ్యాఖ్యలు చేసినప్పుడు ప్రసన్న నోరు తెరవలేదన్నారు. నా తల్లి ఆయనకు మేనత్త.. ఆమెను కించపరిచేలా మాట్లాడినా కూడా మౌనంగా కాకాణిని సమర్థించాడని సోమిరెడ్డి గుర్తుచేశారు. చంద్రమోహన్‌రెడ్డి దగ్గర నుంచి చంద్రబాబునాయుడు వరకు అందరినీ నోటి కొచ్చినట్టు మాట్లాడినా తాము ఓర్చుకున్నామని, ఇప్పుడు ఒక మహిళా ఎమ్మెల్యేపై ప్రసన్న చేసిన వ్యాఖ్యలు మరీ ఘోరమని అన్నారు. రాజకీయాల్లో రాజకీయాలకి సంబంధించి సద్విమర్శలు చేయాలేగానీ, ఇలాంటి వ్యక్తిగత దూషణలు ఏనాటికీ మంచిదికాదని ఆయన స్పష్టం చేశారు. అందులోనూ ప్రజా నాయకుడు నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి కుమారుడిగా ఉండి, ఇలాంటి నీచపు మాటలు మాట్లాడటమా.. నోరు అదుపులో పెట్టుకోవడం చేతకాదా... అని ఆయన ప్రసన్నపై మండిపడ్డారు.

## విస్తరణ దిశగా 'బ్రిక్స్'

మనసులో మాట 53

బ్రెజిల్ రాజధాని రియో డి జనీరోలో జులై 6–7 తేదీల్లో జరిగిన 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగిసింది. దక్షిణ దేశాల బలోపేతం ముఖ్యాంశంగా ఈ సదస్సు జరిగింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల యుద్ధాన్ని ప్రకటించి, రోజుకో బెదిరింపు ప్రకటనతో గందరగోళం సృష్టిస్తున్న నేపథ్యంలో ఈ సదస్సు కొన్ని కీలకాంశాలను చర్చించింది. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్‌ఆఫ్రికాలతో కూడిన ఈ కూటమి, ప్రపంచ దేశాలపై అమెరికా అనుసరిస్తున్న ఏకపక్ష విధానాల ప్రభావాన్ని తగ్గించే లక్ష్యంతో పనిచేస్తోంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికా ప్రపంచ వ్యాప్తంగా తన ప్రాబల్యాన్ని విస్తరించింది. వివిధ వ్యూహాలతో తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటూ వస్తోంది. అమెరికా వైఖరి వల్ల కొన్ని సందర్భాల్లో ఆయా దేశాలు తమ ప్రయోజనాల విషయంలో రాజీపడాల్సి వస్తోంది. బ్రిక్స్ తాజా శిఖరాగ్ర సదస్సులో ఒక ముఖ్యాంశం... ఈ కూటమి విస్తరణ. కూటమిని ఎంతగా విస్తరించుకుంటే అంతగా అమెరికా ఏకపక్ష విధానాలకు చెక్ పెట్టే అవకాశం ఉంటుంది. 2045 నాటికి ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందన్న అంచనాలున్న ఇండోనేషియా బ్రిక్స్‌లో కొత్తగా పూర్తిస్థాయి సభ్యత్వం పుచ్చుకోవడం బ్రిక్స్ కూటమికి కొత్త బలాన్నిచ్చింది. బెలారస్, బొలీవియా, కజకిస్థాన్, క్యూబా, నైజీరియా, మలేషియా, థాయిలాండ్, వియత్నాం, ఉగాండా, ఉజ్బెకిస్తాన్‌లు భాగస్వామ్య దేశాలుగా చేరాయి. బహుళ ధ్రువ ప్రపంచం ఉండాలని, దక్షిణ దేశాల ఐక్యతను పటిష్టం చేయాలనే బ్రిక్స్ ఆకాంక్షను ఈ విస్తరణ ప్రతిబింబించింది. అంతర్జాతీయ నిర్ణయాల ప్రక్రియలో అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల భాగస్వామ్యం మరింత పెరగడానికి అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాల్సిందేనని ఈ సదస్సులో కూటమి పునరుద్ఘాటించింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న మిలిటరీ ఖర్చులు, విభజన ధోరణిపై బ్రిక్స్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి అవసరాలకు తగిన నిధులు కేటాయించడంలో ఎక్కడో లోపం జరుగుతుందని పేర్కొన్నారు. పలు దేశాల అభివృద్ధి అవసరాలపై నిధులు తగ్గుతున్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా రక్షణాత్మక ధోరణి వల్లే నిధుల సాయం తగ్గుతోందన్నది వాస్తవం. ప్రపంచ వాణిజ్యంలో ఏకపక్ష ఆంక్షలు, అధిక టారిఫ్‌లు, రక్షణాత్మక చర్యలపై బ్రిక్స్ సభ్య దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం కోసం పట్టుబడుతున్న భారత్, బ్రెజిల్ ఆకాంక్ష లను ఈ శిఖరాగ్ర సమావేశం పూర్తిగా ప్రతిఫలించలేకపోయింది. వీటో అధికారా లతో కూడిన శాశ్వతసభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు చైనా మోకాలడ్డు తోంది. "భద్రతా మండలి సహా ఐక్యరాజ్య సమితిలో మరింత విస్తృతపాత్ర పోషిం చాలన్న భారత్, బ్రెజిల్ ఆకాంక్షలకు బ్రిక్స్ తన మద్దతును పునరుద్ఘాటిస్తోంది." అని మాత్రమే తీర్మానంలో ఉంది తప్పించి శాశ్వత సభ్యత్వ ఆకాంక్షకు పూర్తిస్థాయి మద్దతును ప్రకటించలేదు. అంటే చైనా మళ్లీ మోకాలొడ్డిందని అర్థం. అమెరికా ఏకపక్ష వైఖరిని అడ్డుకోవాలని బ్రిక్స్ సహా వివిధ వేదికల ద్వారా శతథా ప్రయత్నిస్తున్న చైనా తాను కూడా ఏకపక్షంగానే వ్యవహరిస్తోందనడానికి ఈ ప్రకటనే నిదర్శనం.

విస్తరణతో ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా మారగల సామర్థ్యం బ్రిక్స్‌కు ఉందని భారత ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఇప్పుడు ఇదే స్ఫూర్తితో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, ప్రపంచ వాణిజ్య సంస్థలను కూడా సంస్కరించాలని పిలుపు నిచ్చారు. ఏఐ కాలంలో ప్రతి వారం టెక్నాలజీ మారుతోందని ఆయన గుర్తుచేస్తూ 80 ఏళ్లుగా మారని అంతర్జాతీయ సంస్థలు అనుసంధానాన్ని కోల్పోతున్నాయని పరోక్షంగా భద్రతా మండలిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సంస్కరణలు అనివార్యమని, ఆధునిక సాఫ్ట్‌వేర్‌ను పాతకాలపు టైప్‌రైటర్‌పై ఎప్పటికీ నడపలేరని తనదైన శైలిలో మోదీ వ్యాఖ్యానించారు. ఈ సదస్సుకు చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హాజరుకాకపోవడం గమనార్హం. 2012 నుండి క్రమం తప్పకుండా హాజరవుతున్న జిన్‌పింగ్ ఈసారి హాజరు కాకపోవడానికి చైనాలో అధికార మార్పిడి యత్నాలే కారణం కావచ్చు. తనపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్ట్ వారెంట్ కొన సాగుతున్న కారణంగా పుతిన్ హాజరు కాలేదు. మరోవైపు ట్రంప్ తనదైన శైలిలో బ్రిక్స్‌పై అక్కసు వెళ్లగక్కారు. ఇజ్రాయెల్ పేరును ప్రస్తావించకుండా ఇరాన్‌పై దాడులను బ్రిక్స్ కూటమి ఖండించింది. ఈ నేపథ్యంలో ఆ కూటమిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ "అమెరికా వ్యతిరేక" అని అభివర్ణించారు. డాలర్‌ను బలహీనం చేయాలని బ్రిక్స్ ప్రయత్నిస్తోందని, తాను అందుకు సమ్మతించనని, డాలర్ ఎప్పటికీ రారాజేనని అన్నారు. అంతటితో ఆగితే ఫర్వాలేదు. బ్రిక్స్‌తో చేతులు కలిపే దేశాలపై పదిశాతం సుంకాలు విధిస్తానని బెదిరించారు. ట్రంప్ ఇటీవల కాలంలో చేస్తున్న ఇటువంటి ప్రకటనలు తీవ్ర గందరగోళానికి దారి తీస్తున్నాయి. అమెరికా ఆది నుంచి అనుసరిస్తున్న ఇటువంటి ఒంటెత్తు పోకడల వల్లే బ్రిక్స్ లాంటి కూటములు ఏర్పడుతున్నాయి.

పహల్గాం ఉగ్రదాడిని ఈ కూటమి తీవ్ర పదజాలంతో ఖండించడం భారత్ విజయంగా చెప్పొచ్చు. వచ్చే ఏడాది బ్రిక్స్ సదస్సుకు భారతదేశం అధ్యక్షత వహించ నుంది. బ్రిక్స్‌కు సరికొత్త నిర్వచనం ఇస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బిల్డింగ్ రెసిలెన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫర్ కోపరేషన్ అండ్ సస్టైనబులిటీగా పునఃనిర్వ చిస్తామని తెలిపారు. భారత్ అధ్యక్షతన జరిగే బ్రిక్స్ సదస్సు నాటికి కూటమి మరింత బలోపేతం కావాల్సి ఉంది. కూటమిలో భారత్ మరింత ప్రభావం చూపించేలా మనం వివిధ దేశాలను సమన్వయం చేసుకోవాల్సి ఉంది. అందరూ బాగుండాలి, అందులో మనం ఉండాలన్నదే భారత్ విశ్వాసం. ఆ దిశగానే బ్రిక్స్ ముమ్ముందు కృషి చేయగలదని, అందుకు భారత్ తన పాత్రను సమర్థంగా పోషించగలదని ఆశిద్దాం!



తుమ్మల బాల గంగాధర్ తిలక్




### రీ-కౌన్సిలింగ్‌పై సచివాలయ ఉద్యోగుల నిరసన

బదిలీల విషయంలో రీ–కౌన్సిలింగ్ వద్దంటూ సచివా లయాల పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్–3 ఏఎన్‌ఎంలు ఈనెల 7న నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకురాళ్లు జయలక్ష్మి, వాణి తదితరులు మాట్లాడుతూ, గ్రేడ్–3 నుంచి గ్రేడ్–2కి ఉద్యోగోన్నతి పొం దిన ఏఎన్ఎంలు, వారికి కేటాయించిన సబ్‌సెంటర్లకు వెళ్ల కుండా సచివాలయాల పరిధిలోనే ఉన్నారని, వారికి రీ–కౌన్సి లింగ్ చేసి ఇతర మండలాలకు కేటాయిస్తామనడం అన్యాయ మని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పదోన్నతి పొందినవారిని సబ్‌సెంటర్లకు బదిలీ చేయాలని, అలా వీలుకాని పక్షంలో కౌన్సిలింగ్‌ను రద్దుచేసి, తామిప్పుడు పనిచేస్తున్న చోటనే విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు.

### ప్రసన్న వ్యాఖ్యలపై..నిరసన ర్యాలీ

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ ఈనెల 8న కోవూరులో కూటమిపార్టీల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. స్థానిక మండబయలు నుంచి తాలూకాఫీసు వరకు ప్లకార్డులు ప్రదర్శించి నిరసనలు వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేపై లేనిపోని వ్యాఖ్యలు చేసిన ప్రసన్నను వెంటనే అరెస్ట్ చేయాలని నిరసనకారులు నినదించారు. టీడీపీ నాయకుడు జెట్టి రాజగోపాల్‌రెడ్డి, కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ, ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న విమర్శలు సభ్యసమా జానికే సిగ్గుచేటన్నారు. దిగజారుడు మాటలతో ప్రసన్న వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ప్రసన్న జుగుప్సాకరమైన మాటలను ఎవరూ సహించలేరన్నారు. అనంతరం కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్ర మంలో కూటమి పార్టీ నాయకులు అశోక్‌రెడ్డి, వీరేంద్ర, మల్లారెడ్డి, గాదిరాజు అశోక్, విజయారెడ్డి, నరేంద్ర, సుబ్బా రావు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన

దీర్ఘకాలంగా ఉన్న తమ సమస్యలను ప్రభుత్వం పట్టించు కోవడం లేదంటూ రాపూరులో ఆర్టీసీ ఉద్యోగులు గ్యారేజ్‌లో గేట్‌మీటింగ్ పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఏపీపీటీడీ ఎంప్లా యిస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో డిపో అధ్యక్షుడు సిహెచ్ కృష్ణ, కార్యదర్శి శ్రీనివాసులు, రీజియన్ అధ్యక్షుడు కేవిఎస్ వాసు తదితరులు మాట్లాడుతూ, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీచేయాలని, పదోన్నతులకు వెంటనే అనుమతులివ్వాలని, ఆర్టీసీ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్లు కూడా చెల్లించాల్సి ఉంద న్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిం చాలన్నారు. ఉద్యోగులకు అవసరమైన వైద్య సౌకర్యాలను ఆసుపత్రుల ద్వారా అందించేందుకు పాత పద్ధతుల్లోనే రెఫరెల్ ఆసుపత్రుల ద్వారా లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### కావలిలో ...

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ కావలి ఆర్టీసీ డిపోవద్ద ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఇటీవల ధర్నాందోళన నిర్వహించారు. డిపో కార్యదర్శి పి.బుజ్జయ్య మాట్లాడుతూ, ఎంతో కాలంగా తమ కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల విషయంలోకానీ, బకాయిల సంగతి కానీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. దీంతో తమ కుటుంబాలు అనేక ఆర్థిక సమస్యలతో ఇబ్బందుల పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. తమ డిమాండ్ల సాధనకై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా 129 డిపోలు, వర్క్‌షాపుల్లో ధర్నాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. యూనియన్ జాయింట్ సెక్రటరీ మాల్యాద్రి, కోశాధికారి వెంకటేశ్వర్లు, గ్యారేజ్ విభాగం అధ్యక్షుడు సత్యానందం, కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ వ్యవస్థ కన్నా.. న్యాయవ్యవస్థ ఉన్నతమైనది

**• మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



రాజకీయ వ్యవస్థ కన్నా న్యాయవ్యవస్థ చాలా ఉన్నతమైనదని, దానిని మరింత బలోపేతం చేయవలసిన అవసరం ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 6న నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో, నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ ప్యానెల్‌తో నిర్వహించిన అభినందన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, భారతీయ న్యాయవ్యవస్థ చాలా పటిష్టమైనదన్నారు. సామాన్యులు ఇంకా న్యాయం కోసం ఎదురుచూస్తున్నారని అంటూ, న్యాయవ్యవస్థ రాజకీయాల కతీతంగా ఉండాలన్నారు. రాజకీయ వ్యవస్థలో ఉండే కుమ్ములు, కొట్లాటలు న్యాయ వ్యవస్థలో ఉండకూడదని అభిప్రాయపడ్డారు. ఏసీ సుబ్బారెడ్డి నుండి ఆనం వివేకానందరెడ్డి వరకు దాదాపు తొమ్మిది దశాబ్దాలుగా రాజకీయాలలో ఆనం కుటుంబ మనుగడ సాగుతోందని, దానికి కారణం అప్పటినుండి నేటి వరకు హితులు అయిన వారి సలహాలు సూచనలతోనే సాధ్యమైందని అన్నారు. తాను కూడా 1977వ సంవత్సరంలో న్యాయవాద పట్టా పొందినప్పటికీ, దానిని రిజిస్టర్ చేసుకోలేదని, తనతో పాటు చదివినవారు పలువురు ఉన్నత స్థాయిలో ఉన్నారని అన్నారు. ప్రతి సంవత్సరం ఆనాటి మిత్రులతో సమావేశం ఏర్పరచుకొని, రాజ్యాంగ పీఠికలో సనాతన ధర్మం గురించి చర్చించడం జరిగిందన్నారు. పరిస్థితుల దృష్ట్యా నేడు సనాతన ధర్మం గురించి చర్చించవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కొత్తతరం వారు రాజకీయ వ్యవస్థలకు వస్తున్నారని, అదే విధంగా ఎప్పటికప్పుడు న్యాయవ్యవస్థలో కూడా మార్పులు చెందుతూ ఉంటాయని అన్నారు. వ్యవస్థను మనం కాపాడుకుంటే, అది మనల్ని కాపాడుతుందని అన్నారు. రాజకీయ వ్యవస్థలో మనుగడ కోసం సిద్ధాంతాలు ఉండేవని, నేడు అధికారమే సిద్ధాంతమని. వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా న్యాయవ్యవస్థ పనిచేయాలని ఆకాంక్షించారు. రాజకీయాలకతీతంగా పనిచేసేవారు కేవలం 10 శాతం మాత్రమే ఉంటారని, రాజకీయ ఎన్నికలప్పుడు ఆ శాతం కొంత పెరుగుతుందని అన్నారు. అధికారం లేనప్పుడు ఎవరూ అందుబాటులో ఉండరన్నారు. సామాన్యులకు భరోసా, భద్రత మన వ్యవస్థ అని తెలిపారు. నమ్ముకున్న వారికి సరైన న్యాయం జరిగినప్పుడే న్యాయవ్యవస్థపై దృఢమైన నమ్మకం ఏర్పడుతుందన్నారు. ఎప్పుడూ లేని విధంగా బార్ ఎన్నికలు ఈసారి పోటాపోటీగా జరిగాయన్నారు. ఎన్నో సందర్భాలు, ఇబ్బందికర పరిస్థితులలో తమను సీనియర్ న్యాయవాదులు చంద్రన్న మరియు శీనన్న కలిసి ముందుకు నడిపించారన్నారు. ఈ సంద ర్భంగా బార్ అసోసియేషన్ తరపున ఎన్నికైన సభ్యులను సత్కరించారు. బార్ అసోసి యేషన్ ప్రెసిడెంట్ అయ్యప్పరెడ్డి, జనరల్ సెక్రెటరీ నాగరాజు, జాయింట్ సెక్రెటరీ నారాయణ, సీనియర్ లాయర్లు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# చిరస్మరణీయుడు వైఎస్సార్!

**నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**

దివంగత ముఖ్యమంత్రి డా. వైయస్ రాజశేఖర్‌రెడ్డి జనరంజక పాలనను అందించి ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారని వెంకటగిరి నియోజకవర్గ వైయస్సార్సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వైకాపా శ్రేణులతో కలిసి దివంగత సీఎం వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, కేకు కట్‌చేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహానేత వైఎస్ జయంతి సందర్భంగా ఈనెల 8న వెంకటగిరిలోని తమ నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ప్రజలకు మేలు చేసే సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత డా. వైఎస్‌కే దక్కుతుందన్నారు. ఆయన ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అదేవిధంగా ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి ఆశయాల బాటలో నడుస్తున్నారని, ఆరోగ్యశ్రీ అంటే వైయస్సార్ ఎలా గుర్తుకొస్తారో అమ్మఒడి అంటే వైఎస్ జగన్ గుర్తొస్తారని ఆయన అన్నారు. 2024 ఎన్నికల్లో 40శాతం ఓట్లు సాధించిన ఏకైక పార్టీ వైఎస్ఆర్సీపి అని, కూటమి పార్టీలు సీట్లు సంపాదించగలిగాయి కానీ, ఒక్క పార్టీగా వైఎస్ఆర్సీపి కంటే ఎక్కువ ఓట్ల శాతాన్ని మాత్రం సాధించలేకపోయాయన్నారు.

## 'కూటమి' మోసాలను ప్రజలకు వివరిద్దాం...

కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిద్దామంటూ వైకాపా వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వైకాపా నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇటీవల ఆయన వెంకటగిరిలో నియోజకవర్గ స్థాయి వైకాపా సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి నేతలు మర్చిపోయారని విమర్శించారు. అనంతరం, 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమంపై నియోజకవర్గస్థాయి వైఎస్ఆర్సీపి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ అధినేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' అనే కార్యక్రమాన్ని నిర్వహించేందుకు పార్టీ శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగా 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో'ను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేస్తామన్నారు.

**తిరుపతి జిల్లా గూడూరు డివిజన్**

# టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

**- ఎమ్మెల్యే పాశిం**



గూడూరు మండల పరిధిలోని రామలింగాపురం, సంతదాసు పల్లి గ్రామాల్లో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఇటీవల పర్యటించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో ఆయనకు స్వాగతం పలికారు. రామలింగాపురం గ్రామంలో అభివృద్ధి, సంక్షేమంపై గ్రామస్తులకు వివరించారు. ఆ గ్రామంలో ఉపాధిహామీ పథకం నిధులతో 6 లక్షల రూపాయలతో నిర్మించిన సి.సి రోడ్డును, 9 లక్షల రూపాయలతో నిర్మించిన స్కూల్ ప్రహరీగోడను ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పంచాయతీలో ఏమైనా అభివృద్ధి జరిగిందంటే.. అది చంద్రబాబు నాయుడు హయాంలో జరిగిందే తప్ప మరే ప్రభుత్వం చేయలేదన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వరరాజు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, మట్టం శ్రావణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వాకర్స్ హెల్త్ క్లబ్ ఉచిత వైద్య శిబిరం

గూడూరు, అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఇటీవల వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ముఖ్యఅతిథిగా విచ్చేసిన గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వాకర్స్ కోసం ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేస్తూ మందులు కూడా ఇవ్వడం అభినందనీయమని తెలిపారు. ఈ స్టేడియం అభివృద్ధి కొరకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకర్స్‌కు హామీ ఇచ్చారు. నారా గోపాల్, డాక్టర్‌లు కీర్తి, త్రివిక్రమ్, లక్ష్మీనారాయణ, నాగరాజు, వాకర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జయప్రదంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు





ఈనెల 6వతేదీన శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన రోజు తొలి ఏకాదశిని పురస్కరించుకొని గూడూరు బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్ దంపతులు, బ్రహ్మశ్రీ ఆలూరు శిరోమణిశర్మల పర్యవేక్షణలో గూడూరు రెండో పట్టణ పరిధిలోని శ్రీ ముంగమూరు సీతమ్మ బ్రాహ్మణ భవనంలో సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు జయప్రదంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యులు సి.జనార్ధన్‌రెడ్డి – రోహిణి దంపతులతో పాటు గూడూరు పట్టణంలోని 50 మంది బ్రాహ్మణ దంపతులు వ్రతంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి – రోహిణి దంపతులను, విశ్రాంత తెలుగు పండితులు ఆలూరు శిరోమణిశర్మ దంపతులను సమాఖ్య సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్, ఉపాధ్యక్షులు కడివేటి రామ్మూర్తి, సెక్రటరీ చిట్టమూరు శ్రీనివాసరావు, ట్రెజరర్ విద్యా లలిత, కమిటీ సభ్యులు డిబి శ్రీనివాస్, వేపకొమ్మ నరసింహారావు, పి.పురుషోత్తంరావులతో పాటు విశ్వనాథ రవికుమార్, కె.భవ్య, మల్లికార్జునరావు, శ్రీకాంత్, కార్తీక్, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పశుగ్రాస వారోత్సవాలు



గూడూరు పట్టణంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో పశుగ్రాస వారోత్సవం సందర్భంగా ఇటీవల పాడి రైతులకు పశుగ్రాసంపై గూడూరు పశు వైద్యశాల సహాయ సంచాలకులు సురేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చి మేత లేనిదే పాడి ఎప్పుడూ లాభసాటి కాదన్నారు. నాణ్యమైన పశుగ్రాసాలను పండించి, శాస్త్రీయ పద్ధతుల్లో పశువులను మేపినట్లయితే అధిక పాల ఉత్పత్తి సాధిస్తూ, వ్యాధి నిరోధక శక్తిని కలిగి ఉంటాయన్నారు. పశుగ్రాసాలు రుచికరంగా ఉండడం వల్ల పశువులు ఇష్టంగా తింటాయన్నారు. అనంతరం పశుగ్రాసాల్లోని రకాలను గురించి వివరించారు.

# జననేత జయంతి వేడుకలు




దివంగత నేత వైయస్ రాజశేఖరరెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని వైసిపి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరీగ మురళి అన్నారు. వైయస్సార్ జయంతి సందర్భంగా గూడూరు పట్టణంలోని సాధుపేట శాంతినగర్ వద్ద ఉన్న వైయస్ విగ్రహానికి ఎమ్మెల్సీ మేరీగ మురళి, నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్‌చేసి అందరికీ అందించారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. నాయకులు చేవూరు విజయమోహన్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ వైభవం...!




తమిళనాట తెలుగువారి తలైవర్ డాక్టర్ సియంకే రెడ్డి - శ్రీమతి నిర్మలల మనుమరాలు, డాక్టర్ సియం. కిషోర్ - శ్రీమతి లీలాదేవిల కుమార్తె **అస్మిత - ఆకాష్** (మీనాక్షి మెడికల్ కాలేజీ ఛైర్మన్ ఇ. ప్రభాకర్ - శ్రీమతి జయంతి రాధాకృష్ణన్‌ల కుమారుడు)ల వివాహం ఇటీవల చెన్నైలో ఘనంగా జరిగింది. తమిళనాడు గవర్నర్ ఆర్. ఎన్. రవితో సహా పలువురు రాజకీయ, పారిశ్రామిక, వ్యాపార, సినీ ప్రముఖులు ఈ వివాహ వేడుకలలో పాల్గొని కొత్త దంపతులను దీవించారు. అస్మిత - ఆకాష్ లకి 'లాయర్' శుభాశీస్సులు.



ఇటీవల ప్రకాశం జిల్లా మార్కాపురం పర్యటనకి వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని హెలిపాడ్ వద్ద కలిసి స్వాగతం చెప్తున్న జిల్లా జనసేన నాయకుడు చిట్టిమూరు ప్రవీణ్ కుమార్‌రెడ్డి.

# ఓర్వలేకనే..లేనిపోని విమర్శలు

## ➢ ప్రసన్నపై మండిపడ్డ ప్రశాంతిరెడ్డి



కోవూరు నియోజకవర్గ ప్రజలు తనపై చూపుతున్న ఆదరాభిమానాలు చూసి ఓర్వలేకనే ప్రసన్న అవాకులు చెవాకులు పేలుతున్నాడని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మండిపడ్డారు. ఈనెల 9న విడవలూరు మండలం వరిణి, దండిగుంట గ్రామాలలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్య క్రమంలో భాగంగా ఆమె ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా తనపై ప్రసన్న చేసిన దారుణమైన విమర్శ లను ప్రస్తావిస్తూ.. ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి చీడపురుగులను రాజకీయాల నుంచి తరిమేయాలన్నారు. సాంకేతిక సమస్యల కారణంగా తల్లికి వందనం తదితర ప్రభుత్వ పథకాలు అందని వారి సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్క రించవలసిందిగా సంబంధిత అధికారు లను ఆదేశించారు. చెడు తిరుగుళ్లకు దూరంగా వుండాలని స్థానిక యువతకు హితోపదేశం చేశారు. సామాజిక మాధ్య మాల్లో పడి చదువులు పాడుచేసుకోకుండా క్రీడల పట్ల ఆసక్తి చూపాలంటూ వరిణి, దండిగుంట యువకులకు క్రికెట్ కిట్, వాలీబాల్ కిట్‌లు అందచేయాలని ఆమె వ్యక్తిగత సిబ్బందిని ఆదేశించారు. నడవ లేని ఓ దివ్యాంగుడి అవస్థలు చూసి స్పం దించిన ప్రశాంతిరెడ్డి విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఎలక్ట్రిక్ ట్రైసైకిల్ అందచేస్తానని హామీ ఇచ్చారు. వరిణి గ్రామపెద్దలతో కలిసి సమస్యలపై చర్చించారు. పంచా యతి స్థలాన్ని శ్మశానానికి కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

# కదం తొక్కిన కార్మిక సంఘాలు

## • లేబర్‌కోడ్‌లు రద్దుచేయాలంటూ ఆందోళనలు




లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని, పాత కార్మికచట్టాలు పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత కార్మిక సంఘాల నేతృత్వంలో ఈనెల 9న జరిగిన దేశవ్యాప్త కార్మిక సమ్మెలో నెల్లూరులోని కార్మికసంఘాలు పాల్గొని, ర్యాలీలు, నిరసనలు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా అనేకచోట్ల కార్మిక, ఉద్యోగ సంఘాల వారు ఆందోళనలు చేపట్టారు. వామపక్షాలు, వివిధ కార్మిక సంఘాల వారు, పెద్దసంఖ్యలో కార్మికులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొని కదం తొక్కారు. అఖిల భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమ్మెలో నెల్లూరు నగరంలో సీఐటియు, ఏఐటీయుసి కార్మికసంఘాల సారధ్యంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని, కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న నాలుగు లేబర్ చట్టాలను పునరుద్ధరించాలని, కొత్తగా తెచ్చిన లేబర్ చట్టాలను ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. దీర్ఘకాలంగా ఉన్న కార్మికుల సమస్యలను ఇకనైనా పరిష్కరించాలన్నారు. రవాణా రంగ కార్మికులకు గుదిబండగా మారిన జీఓ నెంబర్ 21ని రద్దుచేయాలన్నారు. సీఐటీయు జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, ఏఐటీయుసి జిల్లా కార్యదర్శి పి. శంకర్‌కిషోర్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు సాగర్, ఏఐఐఎఫ్‌టియు న్యూ నాయకులు యానాదయ్య తదితరులు పాల్గొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాయంటూ విమర్శించారు. సీఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు టీవీవీ ప్రసాద్, రూరల్ అధ్యక్షుడు కొండా ప్రసాద్, కార్యదర్శి కె. పెంచలనరసయ్య, సీపీఎం నగర నాయకులు కత్తి శ్రీనివాసులు, ఆర్ శ్రీనివాసులు, ఏఐటియుసి నాయకులు బసవరాజు, ఐఎన్‌టీయుసి నాయకులు మల్లికార్జునరెడ్డి, సీపీఐ రైతు సంఘం నాయకుడు షానవాజ్, నాయకులు ఇతర అనుబంధ సంఘాల నాయకులంతా పాల్గొన్నారు.

# ఎట్టకేలకు గట్టి చర్యలు!

## 'ఉపాధి' సొమ్ము తినేసిన.. ఆరుగురి ఉద్యోగాలు ఊస్ట్!

## చిన్న గోపవరంలో..బట్టబయలైన 59 లక్షల 'స్వాహా'యణం

జిల్లాలో ఉపాధిహామీ పనుల్లో భారీస్థాయిలో అవకతవకలు జరిగాయని, గత వైకాపా ప్రభుత్వ పాలనలో ఈ పథకం కింద కేటాయించిన నిధుల్ని చాలాచోట్ల గుట్టుచప్పుడు కాకుండా తినేశారని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, ఆ శాఖ ఉన్నతాధికా రులు రంగంలోకి దిగి అవినీతి సిబ్బందిపై కొరడా ఝళి పిస్తున్నారు. అందులో భాగంగా, తాజాగా ఆరుగురు ఉద్యోగు లపై వేటు వేశారు. ఉపాధి సొమ్ము మెక్కేసిన ఆ ఉద్యోగులను ఉద్యోగాల నుంచి ఊడబెరకడమే కాక, ప్రభుత్వ ధనాన్ని స్వాహా చేసినందుకు మరింత కఠినచర్యలు కూడా తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది.


**దొంగమస్టర్లు వేసి దోచేశారు :**

నెల్లూరుజిల్లా కలువాయి మండలంలోని చిన్నగోపవరం పంచాయతీలో ఉపాధిహామీ పథకాన్ని అమలుచేసే క్షేత్ర సహాయకుడు జాబ్‌కార్డుల్లో బయటివ్యక్తుల పేర్లను చేర్చి ప్రభుత్వ నగదును కాజేశారని పెద్దఎత్తున వచ్చిన ఆరోపణలను ఉన్న తాధికారులు సమగ్రంగా విచారించి, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. 2023-24లో చిన్నగోప వరంలో ఎస్సీఎస్టీ బీసీ, ఇతర కుటుంబాల జాబ్‌కార్డుల్లో ఆ గ్రామానికి సంబంధం లేని 148మంది బయటివ్యక్తులను చేర్పించడం, వారంతా ఉపాధి పనులకు హాజరైనట్లు దొంగమస్టర్లు వేసి, భారీగా నిధులు స్వాహాచేయడం జరిగినట్లు సోషల్‌ఆడిట్‌లో వెలుగులోకి వచ్చింది. అంతేకాదు, పనుల్లో కూడా బోగస్ కొల తలు నమోదుచేసి, నిధులను మింగేసినట్లు విచారణలో తేలింది. ఈ ఒక్క గ్రామంలోనే దాదాపు 59 లక్షల రూపాయల మేరకు అవినీతి జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. ఉపాధి హామీ పథకంలో ఇష్టానుసారం అవినీతి జరిగిపోతోందని, క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎవరికి దొరికినంత వారు దోచేస్తున్నారని తెలియడంతో రాష్ట్రస్థాయి అధికారులు రంగంలోకి దిగి అవినీతిపరుల బాగోతా లన్నీ తెలుసుకున్నట్లు సమాచారం. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ చీఫ్ విజిలెన్స్ అధికారి కూడా చిన్నగోపవరానికి వచ్చి ఈ మతలబులన్నీ ఆరా తీసినట్లు తెలుస్తోంది.

**క్రిమినల్ కేసులు నమోదు :**

చిన్న గోపవరంలో ఉపాధి సొమ్మును స్వాహా చేసిన క్షేత్ర సహాయకుడు ఏ.మహేంద్ర, కంప్యూటర్ ఆపరేటర్ పి.బాబు రాజేష్, ఇన్‌చార్జి ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సాంకేతిక సహాయకులు ఆర్ ప్రసన్న, ఎం.వెంకటేశ్వర్లు, ఎంవి ప్రసాద్‌లను సస్పెండ్ చేసి, ఉద్యోగాల నుంచి తీసేయడంతో పాటు, భారీగా అవినీతికి పాల్పడిన వారందరిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేశారు. దీంతో జిల్లాలో ఉపాధి సొమ్ము కాజేసిన ఉద్యోగుల్లో వణుకు మొదలైంది.

# సాయిదర్బార్‌లో.. గురుపౌర్ణమి పూజలు



గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని శ్రీ సాయిబాబా దేవాలయాల్లో ప్రత్యేకపూజలు జరుగుతున్నాయి. ఈనెల 9న బాలాజీనగర్ శివారుల్లోని శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరంలో దేవస్థానం నిర్వాహకులు మధుసాయి ఆధ్వర్యంలో సాయినాథునికి విశేష అలంకారాలు చేసి, పూజలు నిర్వహించారు. ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం నుంచి సీతారామ లక్ష్మణ హనుమత్ సమేతుడై శ్రీరాముడుని పల్లకిపై ఊరేగింపుగా తీసుకువచ్చి, సాయిదర్బార్‌లో పూజలు చేశారు. గురువారం గురుపౌర్ణమి సందర్భంగా అద్దాలమందిరంలో సాయినాథునికి ప్రత్యేక హారతులు, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, పండరిభజనలు, కోలాటాలు కోలాహలంగా జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తరించారు. సాయిభక్తులు పాబోలు సుబ్బరామయ్య, బాబీ సాయి, సాయి సత్సంగ్ సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.



## నారా లోకేష్‌తో..పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

నెల్లూరులో విఆర్ పాఠశాల ప్రారంభోత్సవం, రొట్టెల పండుగ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని స్థానిక అనిల్ గార్డెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

## 12న 'పెరసం' పురస్కారాలు

నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం (పెరసం) 16వ వార్షికోత్సవం ఈనెల 12న జరుగుతుందని, ఇద్దరు రచయితలకు 'పెరసం' పురస్కారాలు ప్రదానం చేస్తామని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మోపూరు పెంచల నరసింహం, గౌరవాధ్యక్షులు అవ్వారు శ్రీధర్‌బాబు, అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి, ప్రధాన కార్యదర్శి తోట సులోచన తదితరులు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక టౌన్‌హాలు రీడింగ్‌రూమ్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు సుభద్రాదేవి, ప్రముఖ కవి చిన్ని నారాయణరావు పాల్గొంటారని, ప్రముఖ బాలసాహితీవేత్త డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ అధ్యక్షత వహిస్తారని వారు తెలిపారు. ఈ సందర్భంగా పాయల మురళీకృష్ణ (గచ్చెంసెట్టుకి అటూ ఇటూ), మిరప రమేష్ (పడమటిదీ నాటకం)లకు పెరసం పురస్కారాలు బహుకరిస్తామన్నారు. ఆ పుస్తకాలను డా.సుంకర గోపాల్, డా.పెళ్ళూరు సునీల్ సమీక్షిస్తారని, సాహిత్యాభిమానులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

### పద్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో..

## భాగవత ప్రవచనాలు

నెల్లూరులోని పద్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు స్థానిక నవలాకులతోట, 3వ మైలులో ఉన్న రామకృష్ణమిషన్ ప్రాంగణం వేదికగా, స్వామి శ్రీ హృదానందజీ మహరాజ్ వారి ఆశీస్సులతో భాగవత ప్రవచన సప్తాహాన్ని నిర్వహించనున్నట్లు పరిషత్ అధ్యక్ష కార్యదర్శులు పోలవరపు లక్ష్మీనరసింహారావు, డా.చీమకుర్తి వెంకటేశ్వరరావు తెలిపారు. 11న అవధాని కోట రాజశేఖర్(ప్రహ్లాద చరిత్ర), 12న డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య (పరీక్షిత్తు కథ), 13న డా.ఐనవోలు చక్రపాణి (రాసలీల), 14న విద్వాన్ అగస్త్యరాజు సుబ్బారావు (వామన చరిత్ర), 15న అవధాని కొండెపి మురళీకృష్ణ (కంస వధ), 16న డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు (గజేంద్రమోక్షం), 17న పోలవరపు లక్ష్మీనరసింహారావు (రుక్మిణీ కల్యాణం) పాల్గొని భాగవతంలోని విశిష్టమైన అంశాలను తమ ప్రవచనాల ద్వారా వివరించనున్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని శ్రీ స్వామి హృదానంద జీ మహరాజ్ (రామకృష్ణ మిషన్-నెల్లూరు) జ్యోతిని వెలిగించి ప్రారంభిస్తారని, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, సింహపురి ధార్మిక సంస్థ అధ్యక్షులు ఉచ్చి భువనేశ్వరిప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని, భక్తులు-సారస్వతాభిమానులు పాల్గొని శ్రీకృష్ణ పరమాత్మ కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

## డా. రావిప్రోలుకు నివాళి



ప్రముఖ గాంధేయవాది, విశాఖలో స్థిర పడిన నెల్లూరీయుండు, ఇటీవల మరణించిన డా.రావిప్రోలు సుబ్రహ్మణ్యంకు నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడులో పినాకిని గాంధీ ఆశ్రమం నిర్వాహకులు ఈనెల 7న సంతాపసభ ఏర్పాటుచేశారు. రావిప్రోలు వారు ఆశ్రమానికి చేసిన సేవలను గుర్తుకుతెచ్చుకుని, ఘన నివాళులర్పించారు. ఆశ్రమ కమిటీ మెంబర్‌గా, ఆహ్వాన కమిటీ ఛైర్మెన్‌గా రావిప్రోలు చిరస్మరణీయమైన సేవలందించారని కొనియాడారు. ఆశ్రమం కో-కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, రెడ్‌క్రాస్ మాజీ ఛైర్మెన్ ఏవీ సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు జీవీ రామిరెడ్డి, కందికట్టు రాజేశ్వరి, గంపల మంజుల, విజయశ్రీ, షేక్ అల్లాభక్షు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో 'సిక్కీ' బృందం

### - - వ్యాపార అవకాశాల పరిశీలన - -



చెన్నైలోని దక్షిణ భారత వాణిజ్య మరియు పరిశ్రమల మండలి (ఎస్ఐసిసిఐ-సిక్కీ)కి చెందిన 22మంది ప్రతినిధుల బృందం ఇటీవల శ్రీసిటీని సందర్శించింది. శ్రీసిటీ పారిశ్రామిక కార్యకలాపాలు, అక్కడ అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతుల అధ్యయనం మరియు పెట్టుబడి అవకాశాలను ఆ బృందం పరిశీలించింది. శ్రీసిటీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (బిజినెస్ డెవలప్‌మెంట్) బోడ్గన్ జార్జ్ ఆ బృందానికి స్వాగతం పలికి, శ్రీసిటీ అత్యుత్తమ మౌళిక సదుపాయాలు, వ్యూహాత్మక స్థానం, వ్యాపారానుకూల పర్యావరణ వ్యవస్థకు సంబంధించి వారికి తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రగతిశీల పారిశ్రామిక విధానాలు, వేగవంతమైన వ్యాపారం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) గురించి వివరించారు. 31దేశాలకు చెందిన 235కి పైగా పరిశ్రమలకు నెలవైన శ్రీసిటీలో విస్తృత వ్యాపార అవకాశాలు ఉన్నాయని, వాటిని పరిశీలించి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని వారిని కోరారు. ఈ పర్యటనపై స్పందించిన శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, దక్షిణ భారతదేశ వ్యాపార స్వరూపాన్ని రూపొందించడంలో 'సిక్కీ' పాత్ర ఎంతో కీలకమని వ్యాఖ్యానించారు. భారీ పరిశ్రమలకే కాకుండా, చిన్న మరియు మధ్య తరహా సంస్థలకు కూడా శ్రీసిటీ అనువైన గమ్యస్థానంగా మారడానికి వీరి పరిశీలనలు, అభిప్రాయాలు సహాయపడతాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్శనకు అనుమతి ఇచ్చినందుకు సిక్కీ బృందంలోని మెంటర్ ఇన్ఫోకామ్ ఇండియా డైరెక్టర్ ఎలంగోవన్ రాజశేఖర్ శ్రీసిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీసిటీ ప్రపంచ స్థాయి మౌళిక సదుపాయాలు, పారిశ్రామిక వాతావరణం తమను విశేషంగా ఆకట్టుకుందని పేర్కొన్నారు. వివిధ రంగాలలోని ప్రముఖ వ్యాపార సంస్థలు, కన్సల్టెన్సీ సంస్థల ప్రతినిధులతో కూడిన ఈ బృందం స్థానిక బ్లూ స్టార్, ఎంఎస్ఆర్ గార్మెంట్స్, బాల్ బేవరేజెస్ తదితర పరిశ్రమలను సందర్శించింది. సిక్కీ ప్రాజెక్ట్స్ హెడ్ ఆర్.శరణ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఈ పర్యటన కొనసాగింది.

## ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ సందర్శన



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ఉన్నతాధికారులతో చర్చల అనంతరం ఆయన స్థానిక మొండెలెజ్, లావాజా, బ్లెండ్‌హబ్, టాటా ఫుడ్స్ తదితర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను సందర్శించి, ఆయా సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు.

## ఆకట్టుకున్న 'వేద విజ్ఞాన వేదిక' సభ



చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో భాగంగా, చెన్నై-టీనగర్‌లోని కృష్ణాహాల్-ఆంధ్రాక్లబ్‌లో 'తిమ్మన పారిజాతాపహరణం-మానసోల్లాస వ్యాఖ్యానం' అనే అంశంపై ఇటీవల జరిగిన కార్యక్రమం సాహిత్యాభిమానులను బాగా ఆకట్టుకుంది. ప్రముఖ సాహితీవేత్త-అన్నమాచార్య వాఙ్మయ పరిశోధకులు..గంధం బసవశంకరరావు (హైదరాబాద్) పాల్గొని మహాకవి తిమ్మన సాహితీ వైదుష్యాన్ని వివరించారు. తిమ్మన రచించిన ప్రసిద్ధమైన 'పారిజాతాపహరణం' ప్రబంధ కావ్యం అప్పట్లో శ్రీకృష్ణదేవరాయలుతో పాటు మహారాణిని కూడా అలరించిందన్నారు. ఈ సందర్భంగా వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు, అధ్యక్షులు జేకేరెడ్డి బసవశంకరరావును ఘనంగా సన్మానించారు. ఆస్కా మాజీ అధ్యక్షులు ఆదిశేషయ్య, సభ్యులు చలపతితో పాటు, చెన్నై నగరానికి చెందిన తెలుగు ప్రముఖులు పాల్గొన్నారు.

## టూకీగా...



### పొదలకూరులో రక్తదాన శిబిరం

పొదలకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 7న సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు బ్లడ్‌గ్రూప్ నమోదుపై అవగాహన కలిగించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, ఎన్ఎస్ఎస్ అధికారి నాహిద్, ఆరోగ్య సహాయకులు వెంకటేశ్వర్లు, కామాక్షమ్మ, అరుణతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

### ఇనమడుగులో అన్నదానం

కోవూరు సమీపంలోని ఇనమడుగు గిరిజనకాలనీలో ఈనెల 7న జనతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు దాసరి ప్రసాద్, సభ్యులు నరేంద్ర, కోటేశ్వరరావు, మనోజ్ అనిల్, మురళి, సుమన్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

### రాపూరులో విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు

రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఈనెల7న ఉచిత వైద్యశిబిరం నిర్వహించి, విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు చేసి, తగు సూచనలిచ్చారు. రాపూరు ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సిద్దిఖీభాను, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి జి.సాయికిరణ్, అధ్యాపకులు, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### సాయిపేటలో విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

కొండాపురం మండలంలోని సాయిపేటలో ఇటీవల తెగిపడి ఉన్న విద్యుత్ వైరు తగిలి పాడిబండ్ల అంకయ్యకి చెందిన గేదె మృతిచెందింది. గేదెలు మేపుకునేందుకు పొలాల వద్దకు గేదెలను తోలుకువెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని, ఆ గేదె విలువ రూ.80వేల దాకా ఉంటుందని, ప్రభుత్వం పరిశీలించి ఆదుకోవాలని ఆయన కోరుతున్నారు.

### సైదాపురంలో సీజనల్ వ్యాధులపై అవగాహన

సైదాపురం ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 7న సర్వసభ్య సమావేశం జరిగింది. సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగించుకోవాలని, ప్రజలు ఆ వ్యాధులకు గురికాకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పలుగోటి లక్ష్మమ్మ సూచించారు. ఎంపీడీఓ రవీంద్ర, తహశీల్దార్ సుభద్ర, జడ్పీటీసీ పోలయ్య, మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

### మనుబోలులో..గ్యాస్ సిలిండర్ పేలిపోయింది

మండల కేంద్రమైన మనుబోలు బీసీకాలనీలో ఈనెల7న మీరావలి అనే వ్యక్తి అన్నం వండుకునేందుకు ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్‌ని వెలిగించగానే మంటలు వచ్చాయి. వెంటనే దానిని బయటకి తెచ్చి పడేయడంతో, కొద్దిసేపు మంటలు చెలరేగి, పెద్దశబ్దంతో పేలిపోయింది. చుట్టుపక్కల వారంతా హడలిపోయారు. కానీ, ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

### కందుకూరులో కంప్యూటర్ శిక్షణ

కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 10వ తేదీ నుంచి ఇంగ్లీష్ కమ్యూనికేషన్స్, కంప్యూటర్స్ బేసిక్స్, జనరల్ అవేర్‌నెస్‌లో ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో ఉత్తీర్ణులై, డిగ్రీలో చేరాలనుకునేవారు ఈ శిక్షణా తరగతులకు హాజరుకావచ్చని ఆయన సూచించారు.

### సోమశిలలో ఉపాధ్యాయినికి సన్మానం

పాఠశాల అభివృద్ధికి పాటుపడి, బదిలీపై వెళ్తున్న సోమశిల హిల్‌కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని కె.ప్రసూనను ఈనెల 7న ఎంఇఓ-2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జి.పెంచలయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పలువురు ఉపాధ్యాయులతో పాటు సోమశిల ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### నందిపాడు వద్ద కార్లు ఢీ..ఒకరు మృతి

దుత్తలూరు మండలం నందిపాడు కూడలి వద్ద ఈనెల 7న జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు ఢీకొన్నాయి. అందులో ఒక కారు.. రోడ్డుపక్కన బస్సు కోసం నిలబడిన ఉన్న నల్లబోతుల వెంకటేశ్వర్లును ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మరణించాడు. ఉదయగిరి సీఐ వెంకట్రావు, ఎస్ఐ ఇంద్రసేనారెడ్డిలు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# విఆర్ హైస్కూలుకు మోక్షం

- విద్యామంత్రి చేతులమీదుగా పున:ప్రారంభం
- ఇదంతా నారాయణ మాస్టారి కృషేనన్న లోకేష్





**వైకాపా హయాంలో మూతబడిన చారిత్రాత్మకమైన విఆర్ హైస్కూలుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఈ పాఠశాలలోనే ఒకప్పుడు పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, డా.బెజవాడ గోపాలరెడ్డి వంటి మహనీయులెందరో చదువుకున్నారు. అలాంటి ప్రతిష్ఠాత్మకమైన పాఠశాల కూడా వైకాపా వారి అరాచక పాలనలో మూతబడిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా అనేక పాఠశాలలకు ఇదే గతి పట్టింది. ఇక ఈ పాఠశాల స్థితి కూడా ఇంతేనా అని ప్రజలు ఆవేదన చెందుతున్న తరుణంలో, మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విద్యా వ్యవస్థకు కూడా వెలుగులు వచ్చాయి. నెల్లూరులోని విఆర్ హైస్కూలులో చదువుకుని, ఇప్పుడు పురపాలక మంత్రిగా ఉన్న నారాయణ కృషితో ఆ పాఠశాల తిరిగి ప్రారంభమైంది. ఈనెల 7న విద్యామంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా దానిని పున:ప్రారంభించడంతో నెల్లూరీయుల్లో సంతోషం వ్యక్తమైంది. ప్రారంభమైన తొలిరోజునే అడ్మిషన్లన్నీ పూర్తికావడం, 'నో అడ్మిషన్' అనే బోర్డును కూడా పెట్టడం ఆ పాఠశాల ప్రతిష్ఠకు నిదర్శనం.**

రాష్ట్రపురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నేతృత్వంలో ఆధునిక హంగులతో అత్యంత అద్భుతంగా రూపుదిద్దుకున్న విఆర్ హైస్కూలుకు ఈనెల 7న రాష్ట్ర విద్యామంత్రి నారా లోకేష్ పున:ప్రారంభోత్సవం చేశారు. విఆర్ విద్యాసంస్థల చరిత్రలోనే ఇదొక మరో అపూర్వ ఘట్టం.

1875లో నగరం నడిబొడ్డున 12 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ పాఠశాలలో స్థానికులతో పాటు పొరుగు జిల్లాల నుంచి వచ్చి ఎంతోమంది విద్యార్థులు చదువుకున్నారు. ఈ పాఠశాలలోనే చదువుకున్న పురపాలక శాఖ మంత్రి నారాయణ చొరవ తీసుకుని రూ.15 కోట్ల వ్యయంతో పాఠశాలను ఆధునీకరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దిన వీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌ను పురపాలక శాఖ మంత్రి నారాయణతో కలిసి మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు.

పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను బోధించాలనే తపనతో నారాయణ ఈ పాఠశాలను అన్నివిధాలా అభివృద్ధి చేశారు. ఈ పాఠశాలకు మంచి భవిష్యత్తు ఉందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి లోకేష్ ఆ పాఠశాల అంతా కలియదిరిగారు. విద్యార్థులకు విద్యావసతులు బాగున్నాయని అభినందించారు. ఈ సందర్భంగా, యాచన చేస్తూ బతుకుతున్న పెంచలయ్య, వెంకటేశ్వర్లు అనే ఇద్దరు పిల్లలు చదువుకోవాలనే ఆసక్తితో ఉన్నట్లు గమనించిన లోకేష్, వారిని వేదిక మీదికి పిలిపించి వారిద్దరికీ ఆ స్కూల్‌లో ప్రవేశం కల్పించడమే కాక, వ్యక్తిగతంగా వారిని దత్తత తీసుకుని చదివిస్తానని కూడా హామీ ఇవ్వడం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ మాట్లాడుతూ, మంత్రి లోకేష్ సహకారంతోనే విఆర్ పాఠశాలను అభివృద్ధి చేసుకోగలిగామని, పేద విద్యార్థులకు ఇదొక వరమని, విద్యార్థులకు క్రీడా పరికరాలు కూడా ఉన్నాయని, ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దిన ఈ పాఠశాలను తల్లితండ్రులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### 'విఆర్ హైస్కూలు'.. పేరు మార్పుపై.. ఆనం అభ్యంతరం :

ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, విఆర్ హైస్కూలు సుమారు 50 ఏళ్ళపాటు ఆనం కుటుంబీకుల ఏలుబడిలో ఉందని, ఈ విద్యాసంస్థ అభివృద్ధికి తమ కుటుంబ పెద్దలు ఎంతగానో కృషిచేశారని చెప్పారు. ఇన్నేళ్ళలో ఏనాడూ స్కూలు పేరును మార్చే ఆలోచన చేయలేదన్నారు. ఇప్పుడు ఆ స్కూలును 'వీఆర్ మునిసిపల్ కార్పొరేషన్ స్కూలు'గా మార్చడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. 'విఆర్ హైస్కూలు'గానే అది కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## యుద్ధ నౌకకు.. 'ఉదయగిరి' పేరు!

### ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న నౌక

ఒక యుద్ధనౌకకు స్థానికంగా ఉన్న పేరును పెట్టడం అరుదైన విశేషమే. తాజాగా నెల్లూరుజిల్లాలోని 'ఉదయగిరి' పేరును ఒక యుద్ధనౌకకు పెట్టడం సంచలనం కలిగిస్తోంది. ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న ఉదయగిరిని ఇటీవల విశాఖపట్నంలోని నేవీ అధికారుల బృందం సందర్శించింది. ఉదయగిరి పేరుతో యుద్ధనౌక రూపుదిద్దుకుని వచ్చే ఆగస్టు 26న ప్రారంభోత్సవం చేసుకోనుందని వారు తెలపడంతో స్థానికుల్లో ఆనందం వెల్లువిరిసింది. నేవీ లెఫ్టినెంట్ కమాండర్ ప్రశాంత్ ఆధ్వర్యంలోని బృందం స్థానిక పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులతో కలిసి ఉదయగిరి దుర్గం కట్టడాలను కూడా ఈ సందర్భంగా పరిశీలించారు.

'ఉదయగిరి' పేరుతో 149 మీటర్ల పొడవు, అందులో 40 మిస్సైళ్ళు పట్టేలా, సుమారు 600 కోట్ల రూపాయలతో యుద్ధనౌకను రూపొందించారని, అది ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని వారు తెలిపారు. దీంతో, ఉదయగిరి పేరు మరోసారి దేశవ్యాప్తంగా మారుమోగడమే కాదు.. 'ఉదయగిరి' పేరు మరింతగా సార్థకం.. చరితార్థం అవుతుంది కూడా!..



### ప్రసన్న వ్యాఖ్యలను..


## ప్రజలు ఛీదరించుకుంటున్నారు

**ఉండవల్లి శ్రీదేవి**

కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఛీదరించుకుంటున్నారని మాదిగ కార్పొరేషన్ ఛైర్పర్సన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. బుధవారం మధ్యాహ్నం ఆమె నెల్లూరులోని విపిఆర్ నివాసంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని కలిసి సంఘీభావం తెలియజేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, ప్రసన్న వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై సభ్య సమాజం తల దించుకునేలా వ్యాఖ్యలు చేయడం ఏమిటని ఆమె మండిపడ్డారు. వేమిరెడ్డి వైకాపాలో ఉన్నప్పుడు ఆ దంపతులు దేవుళ్ళంటూ కీర్తించారని, ఇప్పుడు వారు పార్టీ మారడంతో వారిపై లేనిపోని విమర్శలు చేయడం మంచిపద్ధతి కాదని అన్నారు. కోవూరు ఎమ్మెల్యేగా ఉన్న ప్రశాంతిరెడ్డిపై వ్యక్తిగత నిందలు వేస్తూ మాట్లాడడం దారుణమన్నారు. ఇటీవల అమరావతి మహిళలపై కూడా వైసీపీ నేతలు కొందరు నీచంగా మాట్లాడారని గుర్తుచేశారు. వైసీపీ పేటీఎం బ్యాచ్ మహిళల గురించి దారుణంగా మాట్లాడుతున్నారని, ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకురాళ్ళు తాళ్ళపాక అనురాధ, భూలక్ష్మి, ఇతర మహిళా నేతలు పాల్గొన్నారు.

## చదువుకు పేదరికం అడ్డు కాదు!

చదువుకు పేదరికం అడ్డు కాదని, అందుకు తానే ఒక నిదర్శనమని మంత్రి నారాయణ తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు ఇచ్చే ఆస్తి చదువేనని ఆయన అన్నారు. ఈనెల 10వ తేదీ గురువారం నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. 15-16 డివిజన్లలో జరుగుతున్న కాలువల పూడికతీత పనులను, రోడ్డు పనులను పరిశీలించారు. 'ఏడాది సుపరిపాలన-తొలి అడుగు' కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందజేసి, ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం 8వ డివిజన్లో ఆర్ఎస్ఆర్ స్కూల్‌లో జరుగుతున్న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొని, ఉత్తమ విద్యార్థులను సన్మానించి, పాఠశాలలో మొక్కలు పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన చిన్నారుల నృత్యప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. ఆ తర్వాత మంత్రి నారాయణ విలేకర్లతో మాట్లాడుతూ, రాష్ట్రంలో 45,094 ప్రభుత్వ ఎయిడెడ్ స్కూల్స్ పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో పాల్గొనడం జరుగుతోందని.. భారతదేశంలోనే ఎక్కడా కూడా ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమం జరగలేదన్నారు.



విద్యార్థుల చదువు నడవడికలు పేరెంట్స్ తెలుసుకునేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి నారాయణ తెలిపారు. పేద పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉద్దేశంతో మంత్రి నారా లోకేష్ 'పేరెంట్స్ టీచర్ మీటింగ్' పెట్టారన్నారు. గత ప్రభుత్వం అప్పులే మిగిల్చినా, తమ ప్రభుత్వం వచ్చాక ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 'తల్లికి వందనం' పథకం అందిస్తున్నామన్నారు, నగరంలోని ఆర్ఎస్ఆర్ స్కూల్‌ను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దత్తత తీసుకున్నారని, విఆర్ హైస్కూల్ కంటే అద్భుతంగా దానిని వారు తీర్చిదిద్దుతారని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఆ స్కూల్ సిద్ధంగా ఉంటుందని, అదేవిధంగా డిఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ వారు మూలాపేట స్కూల్‌ను దత్తత తీసుకొని ఆధునీకరణ పనులు చేపడుతున్నారని ఆయన తెలిపారు. అనంతరం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, ఆర్ఎస్ఆర్ స్కూల్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. విద్యామంత్రి లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్ ఒక మంచి కార్యక్రమం అని.. ఆయన కొనియాడారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com